ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పల్నాడు జిల్లా వార్తలు
5
శనివారం 15 నవంబరు 2025





● ప్రమాణ స్వీకారం చేయిస్తున్న పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య, చీఫ్‌విప్ జీవీ



పిడుగురాళ్లలో అనధికార కట్టడాలను తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

అనధికార కట్టడాలపై కన్నెర్ర

మున్సిపాల్టీల్లో అక్రమ నిర్మాణాల తొలగింపు

పిడుగురాళ్ల, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలో అనధికార కట్టడాలు, అక్రమ లే అవుట్లపై మున్సిపల్ అధికారులు కన్నెర్ర చేస్తున్నారు. పట్టణంలోని 2వ వార్డులో జీ+1 నివాసానికి అనుమతి పొంది అనధికారికంగా దుకాణాన్ని నిర్మిస్తున్నట్లు మున్సిపల్ అధికారులు గుర్తించారు. దీంతో శుక్రవారం ఆ అనధికార కట్టడాన్ని గుర్తించి తొలగించారు. ఈ సందర్భంగా కమిషనర్ ఐ శ్రీనివాసులు మాట్లాడుతూ భవన నిర్మాణాలు చేపట్టేవారు నిబంధనల మేరకు మాత్రమే చేపట్టాలన్నారు. ఇప్పటికే నిబంధనలను అతిక్రమించి నిర్మించిన కట్టడాల క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అలా కాకుండా అనధికార కట్టడాలకు సంబంధించి దరఖాస్తు చేసుకోకుంటే వాటిని తొలగిస్తామన్నారు. పట్టణ పరిధిలో అనధికార నిర్మాణాల గుర్తింపునకు నిరంతరం తనిఖీలు చేపడతామన్నారు.

అనధికార నిర్మాణాలపై కఠిన చర్యలు

మాచర్ల: పట్టణంలోని అనధికార నిర్మాణాలు, లేఅవుట్లపై కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ దూళిపాళ్ల వేణుబాబు హెచ్చరించారు. పట్టణంలో అనధికారికంగా నిర్మిస్తున్న నిర్మాణాలను శుక్రవారం ఆయన సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2025 ఆగస్టు 31కి నిర్మించిన అనధికార భవనాలను క్రమబద్ధీకరించుకునేందుకు ప్రభుత్వం బిల్డింగ్ పినలైజేషన్ స్కీంను అమలు చేసిందన్నారు. నిర్మాణాలకు సంబంధించి తప్పనిసరిగా పురపాలక సంఘ అనుమతులు తీసుకోవాలన్నారు.



మాచర్ల : నిర్మాణాలను పరిశీలిస్తున్న కమిషనర్ వేణుబాబు

స్వగృహం శిథిలం



● డబుల్ బెడ్‌రూమ్ అపార్ట్‌మెంట్లు

రూ.25 కోట్ల భవనాలు నిరుపయోగం

పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేటలో కలెక్టరేట్‌కు కూతవేటు దూరంలో రూ.25 కోట్లతో నిర్మించిన రాజీవ్ స్వగృహ భవనాలు శిథిలమవుతున్నాయి. ఏళ్ల తరబడి ఆ భవనాల వినియోగాన్ని పాలకులు విస్మరించారు. వీటిలో అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నా అధికారులకు పట్టడం లేదు.

● ప్రభుత్వ కార్యాలయాలకు కేటాయింపుతో సరి ● మౌలిక వసతులు లేక వెనుకంజ వేస్తున్న అధికారులు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

మధ్యతరగతి కుటుంబాలకు సొంత ఇంటి కల నెరవేర్చే లక్ష్యంతో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రాజీవ్ స్వగృహ పథకంలో ఇళ్ల కోసం 1,118 మంది దరఖాస్తు చేసుకున్నారు. దీంతో 2009లో లింగంగుంట్లకాలనీలో నీటి పారుదల శాఖకు చెందిన ఐదు ఎకరాల్లో మూడు బ్లాక్‌ల్లో 672 ప్లాట్ల నిర్మాణానికి స్వగృహ కార్పొరేషన్ ప్రణాళిక రూపొందించింది. తొలివిడతలో 168 డబుల్, 84 సింగిల్ బెడ్‌రూమ్ ప్లాట్ల నిర్మాణం జరిగింది. ఆ తర్వాత లబ్ధిదారులు ముందుకు రాకపోవడంతో ఈ భవనాలను ఎవరూ పట్టించు కోలేదు. ఈ క్రమంలో నూతనంగా పల్నాడు జిల్లా ఏర్పాటుతో 2022లో రాజీవ్ స్వ గృహ భవనాల్లో జిల్లా కార్యాలయాలను ఏర్పాటు చేయాలని ప్రభు త్వం నిర్ణయించింది. ఈ మేరకు 37 జిల్లా కార్యాలయాలకు భవనాలను కేటాయించారు. ఈ మేరకు బోర్డులు కూడా ఏర్పాటు చేశారు. ఇక్కడ ఆయా కార్యాలయాలకు మౌలిక వసతులు కల్పించేందుకు రూ.2.70 కోట్ల అంచనాతో కలెక్టర్ ప్రతిపాదనలు పంపారు. అయితే నిధులు విడుదల చేయకపోవడంతో ఈ భవనాల వినియోగాన్ని ఆయా శాఖలు విర మించుకున్నాయి. ఆయా కార్యాలయాలను చాలీచాలని అద్దె భవనాల్లో మౌలిక వసతులు లేకపోయినా తప్పనిసరి (మిగతా 6వ పేజీలో)



భవనానికి ఏర్పాటు చేసిన ప్రభుత్వ కార్యాలయాల బోర్డులు

ప్రజాసేవకే జీవితం అంకితం


● పదిలో జిల్లా మొదటి ర్యాంక్ సాధిస్తే రూ.2 లక్షలు
● పార్టీ కమిటీల ప్రమాణ స్వీకారోత్సవంలో చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు
● రాష్ట్రానికి పట్టిన గ్రహణం వీడింది : సంస్థాగత ఎన్నికల కమిటీ చైర్మన్ వర్ల రామయ్య

వినుకొండ, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రజలు ఇచ్చిన బాధ్యతను అవకాశంగా చేసుకుని ప్రజాసేవకే తన జీవితాన్ని అంకితం చేస్తానని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు తెలిపారు. సంస్థాగత ఎన్నికల్లో ఎన్నుకున్న గ్రామ, మండల స్థాయి క్లస్టర్లతో పాటు 15 అనుబంధ సంఘాల అధ్యక్ష, కార్యదర్శుల ప్రమాణ స్వీకారోత్సవం స్థానిక నరసరావుపేట రోడ్డులోని గంగినేని కల్యాణ మండపంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జీవీ మాట్లాడుతూ అభివృద్ధి కోసం పాటుపడతానని, అంకిత భావంతో పనిచేసి గ్రామాలను అభివృద్ధి చేస్తానన్నారు. పదవులు అనేవి బడుగు, బలహీన వర్గాలకు న్యాయం చేసేందుకేనని ఎన్‌టీఆర్ టీడీపీని స్థాపించారని, దానిని చంద్రబాబునాయుడు ముందుకు తీసుకుపోతున్నారన్నారు. ఎన్ఎస్‌పీ కాలనీ ఆవరణలో అభివృద్ధి చేసి చూపిస్తానని, ఘాట్‌రోడ్డు, రామలింగేశ్వరస్వామి దేవాలయాన్ని నిర్మిస్తామన్నారు. ఇక నుంచి వారానికి మూడు రోజులు ప్రజాదర్బార్ ద్వారా ప్రజా సమస్యలు పరిష్కరిస్తామన్నారు. పార్టీ కార్యకర్తల సమస్యలను కూడా తెలుసుకుని వారికి అండగా నిలుస్తామన్నారు. గ్రామాల్లో ఘర్షణలు తలెత్తకుండా ఇప్పటికే శాంతికమిటీలను ఏర్పాటు చేయాలని పోలీసులకు ఆదేశించినట్లు తెలిపారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎన్‌డీఏను గెలిపించాలని పిలుపునిచ్చారు. పదో తరగతి పరీక్షల్లో జిల్లాస్థాయిలో మొదటిస్థానం సాధించిన విద్యార్థులకు రూ.2 లక్షలు పారితోషికం అందిస్తానన్నారు. టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, సంస్థాగత ఎన్నికల కమిటీ చైర్మన్ వర్ల రామయ్య మాట్లాడుతూ అరాచక శక్తులను గ్రామాల్లో గెలిచే అవకాశం కల్పించరాదని కార్యకర్తలకు పిలుపు నిచ్చారు. రాష్ట్రానికి పట్టిన గ్రహణం వీడిందని, వటవృక్షంలాంటి అవినీతిని తరిమి కొట్టాలన్నారు. కార్యక్రమంలో జీడీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, నియోజకవర్గ పరిశీలకులు మానుకొండ శివప్రసాద్, నాయకులు లగడపాటి వెంకట్రావు, పెమ్మసాని నాగేశ్వరరావుతో పాటు మండల టీడీపీ అధ్యక్షులు, సొసైటీల అధ్యక్షులు, నియోజక వర్గ ఎస్సీ, ఎస్టీ, బీసీ నాయకులతో పాటు జడ్పీటీసీలు, మార్కెట్‌యార్డు చైర్మన్‌లు పాల్గొన్నారు.

ఖాతాల్లో.. రూ.కోట్లు

బ్యాంకు ఖాతాల్లో ఎవరూ క్లెయిమ్ చేయని ప్రజల డబ్బు రూ.కోట్లలో ఉంది. వివిధ బ్యాంకుల్లో పొదుపు ఖాతాలు, కరెంట్ అకౌంట్లు, టర్మ్ డిపాజిట్లు వంటి ఖాతాల్లో పదేళ్లకు పైగా ఎవరూ క్లెయిమ్ చేయకుండా ఉన్న వాటిని అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్లుగా పరిగణిస్తారు. అలాంటి ఖాతాల్లో గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల పరిధిలోని ఖాతా దారులు లక్షల్లో ఉండగా.. వారికి చెందిన నగదు రూ.కోట్లలో మూలుగుతోంది. ఇలా ఒక్క గుంటూరు జిల్లా వరకు చూస్తే ఇప్పటి వరకు గుర్తించిన 7,48,948 ఖాతాల్లో రూ.149 కోట్లు ఉన్నట్లు బ్యాంకుల అధికారులు తేల్చారు. అన్‌క్లెయిమ్డ్ ఖాతాలు, అందులోని నగదుకు సంబంధించి రిజర్వు బ్యాంకు ఆదేశాలతో ఎక్కడికక్కడ బ్యాంకులు ఆయా వివరాలను ఇటీవల ప్రకటించాయి. ఆయా ఖాతాలకు సంబంధించి లీడ్ బ్యాంకు అధికా రులు ప్రజ ల్లో అవగాహన కల్పిస్తూ వివరాలు అంద జేసి నగదు ఉపసంహరించుకోవాలని సూచిస్తున్నారు.

● బ్యాంకుల్లో మూలుగుతోన్న నగదు
● క్లెయిమ్ చేసుకునేందుకు ముందుకు రాని వైనం
● ఒక్క గుంటూరు జిల్లాకు సంబంధించే రూ.149 కోట్లు
● పల్నాడు, బాపట్ల జిల్లాల్లో లక్షల్లో అన్‌క్లెయిమ్డ్ ఖాతాలు ● గ్రామాల్లో అవగాహన కల్పిస్తోన్న లీడ్ బ్యాంకు అధికారులు
● ఉద్గం పోర్టల్‌ల్లో వివరాలు చూసుకునే అవకాశం కల్పించిన ఆర్‌బీఐ



(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

మనలో చాలామందికి బ్యాంకుల్లో పొదుపు ఖాతా (ఎస్‌బీ), కరెంట్ ఖాతాలు లేదా టర్మ్ డిపాజిట్లు ఉంటాయి. కొంతమంది తమ ఖాతాలను రెగ్యులర్‌గా నిర్వహిస్తుంటారు. మరికొంత మంది వాటిని సరిగా నిర్వహించరు.. లేదంటే ఏదో ఒక కారణంతో మర్చిపోతారు. ఒక్కోసారి ఖాతాదారుడు లేదా డిపాజిటర్ చనిపోతే వారి వారసులకు వాటి వివరాలు తెలియక పోవచ్చు. బ్యాంకుల్లో క్లెయిమ్ చేయని డిపాజిట్లు ఏటేటా పెరిగిపోతున్నాయి. మరుగున పడిన ఖాతాలు లక్షల్లో ఉండగా.. డిపాజిట్లు రూ.కోట్లలో ఉన్నట్లు రిజర్వు బ్యాంకు ఆదేశాలతో జిల్లాల వారీగా, బ్యాంకుల వారీగా (మిగతా 6వ పేజీలో)

జిల్లా పరిషత్‌లో సమావేశం...

అన్‌క్లెయిమ్డ్ సొమ్ముపై అవగాహన కల్పించేందుకు లీడ్ బ్యాంకు శుక్రవారం గుంటూరు జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేసింది. ఈ కార్యక్రమంలో లీడ్ బ్యాంకు మేనేజర్ మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్లు అధికంగా ఉన్న గ్రామాల్లో ప్రత్యేక క్యాంపులు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ శాఖలు, సీఎఫ్ఎల్ బృందం, బ్యాంకు మిత్రల సమన్వయంతో అన్‌క్లెయిమ్డ్ ఖాతాలు తగ్గేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఆర్బీఐ ఎల్‌డీఓ రోహిత్ అగర్వాల్, యూనియన్ బ్యాంక్ డిప్యూటీ రీజినల్ హెడ్ సత్యజిత్ కబి, ఎస్‌బీఐ గుంటూరు రీజినల్ మేనేజర్ కిశోర్‌కుమార్, ఎల్‌ఐసీ ఏడీఎం సుజాతతో పాటు వివిధ బ్యాంకుల అధికారులు, సిబ్బంది, ఇన్సూరెన్స్ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న లీడ్ బ్యాంకు మేనేజర్ మహిపాల్‌రెడ్డి

అమరావతికి.. పెట్టుబడుల వరద



● రాజధానిలో 20 ఎకరాల్లో టైటాన్ ఇన్‌టెక్ సంస్థ
● సీఐఐ సదస్సులో సీఆర్‌డీఏతో పలు సంస్థల ఒప్పందాలు
● హర్షం వ్యక్తం చేస్తోన్న రాజధాని వాసులు, సీఆర్‌డీఏ వర్గాలు

అమరావతి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో పెట్టుబడులు పెట్టి పరిశ్రమలు స్థాపించేందుకు పలు సంస్థలు ముందుకు వస్తున్నాయి. విశాఖపట్టణంలో శుక్రవారం నుంచి ప్రారంభమైన ది కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ(సీఐఐ) భాగస్వామ్య సదస్సు - 2025లో వివిధ సంస్థలు ఏపీసీఆర్‌డీఏతో ఒప్పందం చేసుకున్నాయి. బయో టెక్నాలజీ, విద్య, ఫ్యాషన్, రియల్‌ఎస్టేట్ తదితర రంగాల్లో ఆయా సంస్థలు పెట్టుబడులు పెట్టనున్నాయి. సీఐఐ సదస్సు లో తొలిరోజునే దాదాపుగా రూ.32 వేల కోట్ల పెట్టుబడులను ఏపీసీఆర్‌డీఏ ఆకర్షించింది. ఎనిమిది సంస్థలు ఒప్పందాలు చేసుకోవడంపై అటు రాజధాని వాసులు, ఇటు సీఆర్‌డీఏ వర్గాల నుంచి హర్షం వ్యక్తమౌతున్నది. మరికొన్ని సంస్థలు కూడా శనివారం వాటి పెట్టుబడులు గురించి ప్రకటించే అవకాశం (మిగతా 6వ పేజీలో)

ఒప్పందాలు చేసుకున్న సంస్థలు..

- మణిపాల్ గ్రూపు(యూట్యూబ్ మీడియా టెక్నాలజీ హబ్) రూ.15 వేల కోట్లు
- బెర్హాయ గ్రూపు(రెసిడెన్షియల్, కమర్షియల్, థీమ్ పార్కు, వేస్టు మేనేజ్‌మెంట్) రూ.8300 కోట్లు
- అమరావతి లైఫ్ సైన్సెస్(బయోటెక్ పార్కు) రూ.2 వేల కోట్లు
- మైసిటీ/మలేషియా సిటీ(సిటీ విత్ ఇన్ సిటీ) రూ.2 వేల కోట్లు
- విప్వెన్స్ గ్రూపు విక్టోరియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(అంతర్జాతీయ విద్యా సంస్థలు) రూ.2 వేల కోట్లు
- పెఫ్-ఫ్యాషన్ ఎంటర్‌ప్రెన్యూర్ ఫండ్ (వెంచర్ స్టూడియో అండ్ ఎకో సిస్టమ్ బిల్డర్ ఫర్ ఫ్యాషన్ లైఫ్‌స్టయిల్ రిటైల్ అండ్ మీడియా) రూ. 1200 కోట్లు
- ఏస్ అర్బన్ డెవలప్‌మెంట్ ప్రైవేటు లిమిటెడ్(మైస్ హబ్) రూ.1800 కోట్లు పెట్టుబడి
- ఫిరా బార్సిలోనా ఇంటర్నేషనల్ సంస్థ కన్వెన్షన్ అండ్ ఎగ్జిబిషన్ సెంటర్.



నాడు శంకుస్థాపన.. నేడు నిర్మాణం

ఎట్టకేలకు రూ.2 కోట్లతో రైల్వేస్టేషన్ రోడ్డు

దాచేపల్లి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం శంకుస్థాపన చేయగా.. కూటమి ప్రభుత్వంలో నిర్మాణం పూర్తి చేసు కున్నది. గోతుల రోడ్డుతో రాకపోకలు సాగిస్తూ ఇంతకాలం ఇబ్బంది పడిన వాహన చోదకులకు ఇక్కట్లు తీరేలా రోడ్డు నిర్మాణం జరిగింది. దాచేపల్లి నగర పంచాయతీ నారా యణపురంలోని నడికూడి రైల్వే స్టేషన్ రోడ్డుకు వైసీపీ హయాంలో ఎన్నికలకు ముందు హడావుడిగా 2024లో శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత అనేక బాలారిష్టాలతో రోడ్డు నిర్మాణం అసంపూర్తిగా నిలిచింది. ఈ రోడ్డుపై రాకపోకలకు ప్రజలు ఇబ్బంది పడుతూ ఉన్నారు. ఇటీవల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన సమీక్షలో రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సుమారు రూ.2 కోట్లతో రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. నడికూడి రైల్వే స్టేషన్‌కు వెళ్లే మార్గంలో వివిధ పాఠశాలలు, ఆస్పత్రులు ఉన్నాయి. రోడ్డు నిర్మాణం పూర్తి చేసుకోవడంపై ఆ ప్రాంత ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



నూతనంగా వేసిన నడికూడి రైల్వే స్టేషన్ రోడ్డు



విందు.. వినూత్నంగా సహపంక్తి బాలోత్సాహం

కాకుమానులో ఎంపీపీ(మెయిన్) పాఠశాలలో బాలల దినోత్సవం సందర్భంగా పసందైన విందును వినూత్నంగా ఏర్పాటు చేశారు. మండల విద్యాశాఖ కార్యాలయం వద్ద ఉన్న ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులతో కలసి కేక్‌ను కట్ చేశారు. చిన్నలింగాయపాలెంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు కలసి సహపంక్తి భోజనం చేశారు.

- కాకుమాను, ఆంధ్రజ్యోతి

భద్రతా ప్రమాణాలను మెరుగుపరచాలి
● ఢిల్లీ పేలుళ్ల దృష్ట్యా మరింత పటిష్టపరచాలి
● రుణ సంస్థల రికవరీ ఏజెంట్లపై ప్రత్యేక దృష్టి
● నేర సమీక్ష సమావేశంలో ఎస్పీ వకుల్ జిందాల్
8

విద్యుత్ విజిలెన్స్ అధికారుల దాడులు
● రూ 1.74 కోట్ల అపరాధ రుసుం విధింపు
6
కౌలు రైతు ఆత్మహత్య

ప్రభుత్వాస్పత్రుల్లో కాన్పులు పెరగాలి

వైద్య సిబ్బందికి సూచించిన డీఎంహెచ్‌వో రవి

రాజుపాలెం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాస్పత్రుల్లో కాన్పుల సంఖ్య పెరిగే విధంగా సిబ్బంది చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌వో రవి తెలిపారు. శుక్రవారం రాజుపాలెం పీహెచ్‌సీని డీఎంహెచ్‌వో ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. గర్భిణులకు అందుతున్న వైద్యసేవలు, పీహెచ్‌సీలో ఉన్న మందుల నిల్వల గురించి తెలుసుకున్నారు. రక్త పరీక్షల ల్యాబ్‌లో జరిగే పరీక్షల వివరాలను వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ వైద్యశాలలో మెరుగైన సేవలు అందిస్తున్నారని ప్రజలు కూడా వైద్య సేవలను ఉపయోగించుకోవాలన్నారు. ఉపవైద్యాధికారి హనుమకుమార్ తదితరులున్నారు.



రాజుపాలెంలో అగ్నిమాపక పరికరాలను తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌వో రవి

అధునాతన పరిశోధనలు విస్తృతమవ్వాలి

● ఐసీఎంఆర్- ఎన్ఐఏ డైరెక్టర్ ప్రొఫెసర్ మనోజ్ ముర్హేకర్

● ఏపీ ఎస్ఆర్ఎం వర్సిటీలో బ్రెయిన్ ల్యాబ్ ప్రారంభం



బ్రెయిన్ ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న మనోజ్ ముర్హేకర్

తుళ్లూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): దేశ ప్రయోజనాలకు దోహదపడే అధునాతన పరిశోధనలను యూనివర్సిటీలు విస్తృత పరచాలని చెన్నైలోని ఐసీఎంఆర్- నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎపిడెమియాలజీ డైరెక్టర్ ప్రొఫెసర్ మనోజ్ ముర్హేకర్ సూచించారు. శుక్రవారం ఉదయం ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీకి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన వర్సిటీలోని ఈసీఈ విభాగం ఏర్పాటు చేసిన నూతన బయోమెడికల్ రీసెర్చ్ అండ్ ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ నెట్‌వర్క్ (బ్రెయిన్) లేబొరేటరీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన పరిశోధన విద్యార్థులు, రీసెర్చ్ రంగంలో ఉన్న ప్రొఫెసర్లకు పలు సూచనలు చేశారు. దేశ వ్యాప్తంగా ఎంతో ప్రాధాన్యత కలిగిన బ్రెయిన్ లేబొరేటరీని ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో ఏర్పాటు చేయడం విశేషమంటూ.. వర్సిటీలో పెరిగిన పరిశోధనలకు ఇది తార్కాణమని కొనియాడారు. ఈ సందర్భంగా లేబొరేటరీ కో ఆర్డినేటర్, ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ కేపీ సునీత లేబొరేటరీలో అందుబాటులో ఉన్న వివిధ రకాల పరీక్షలు, విశ్లేషణల గురించి వివరించారు. మనోజ్ ముర్హేకర్ ట్రిమ్మర్ క్లాసిఫికేషన్ పరీక్షలను పరిశీలించారు. రూ.1.50 కోట్ల అంచనా వ్యయంతో బ్రెయిన్ లేబొరేటరీని ఏర్పాటు చేశామని, విద్యార్థుల పరిశోధనలకు ఇది ఎంతగానో ఉపయుక్తంగా మారుతుందని వర్సిటీ వైస్ చాన్సలర్ ఆచార్య సీహెచ్ సతీష్‌కుమార్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీఎంఆర్ సీనియర్ సైంటిస్ట్ గణేష్ కుమార్, వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్ ప్రేమ్ కుమార్, డీన్లు డాక్టర్ సీవీ టమి, డాక్టర్ రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల బ్యాక్‌లాగ్ ఖాళీల భర్తీ గడువు పొడిగింపు

అమరావతి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని వివిధ శాఖల్లో దివ్యాంగులకు కేటాయించిన బ్యాక్‌లాగ్ పోస్టుల ఖాళీల భర్తీకి సంబంధించిన గడువును ప్రభుత్వం 2026 మార్చి 31 వరకు పొడిగించింది. ఈ మేరకు రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమశాఖ కార్యదర్శి సూర్యకుమారి శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు.

నేడు తెనాలిలో జాబ్ మేళా

గుంటూరు(విద్య), నవంబరు 14(ఆంధ్రజ్యోతి): నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శనివారం తెనాలిలోని గవర్నమెంట్ ఇండస్ట్రీస్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు డైరెక్టర్ కొండా సంజీవరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జాబ్ మేళాకు సుమారు 10 కంపెనీల ప్రతినిధులు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. 10వ తరగతి నుంచి బి.టెక్ వరకు విద్యార్హతలు ఉన్న వారు పాల్గొనవచ్చన్నారు. అభ్యర్థుల వయసు 18-25లో ఉండాలని, ఇతర వివరాలకు డి.రాజా (78937 89361) వి.మణికంఠ గోపాల్ (93468 90335)ను సంప్రదించాలని సూచించారు.

సాంకేతికతతో సహకార రంగం మరింత బలోపేతం

● పారదర్శక సేవలందించాలి ● డీసీసీబీ చైర్మన్ మక్కెన



సహకార పతాకాన్ని ఆవిష్కరిస్తున్న మక్కెన, డీసీవో వీరాచారి, సీఈవో అజయ్‌కిషోర్ తదితరులు

గుంటూరు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతికతతో సహకార రంగం మరింత బలోపేతం అవుతుందని జిల్లా కేంద్ర సహకార బ్యాంకు చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు పేర్కొన్నారు. గుంటూరు బ్రాడీపేటలోనున్న ఎన్‌టీఆర్ సహకార భవన్‌లో 72వ అఖిల భారత సహకార వారోత్సవాల సందర్భంగా ఆయన సహకార పతాకాన్ని ఆవిష్కరించారు. సహకార సంఘాలు రైతుల అభ్యున్నతి కోసం ఏర్పడ్డాయని, ప్రతి ఒక్కరు రైతుల అభివృద్ధి, సంక్షేమం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. జీడీసీసీ బ్యాంకు ద్వారా శతాబ్దానికి పైగా రైతులందరికి విశేష సేవలు అందిస్తామన్నారు. బ్యాంకులో ఎటువంటి తప్పిదాలు జరిగినా సరిచేసి, రైతుల కోసం అందరం కష్టపడి పని చేయాలని కోరారు. ప్రధాని నరేంద్ర మోదీ, సీఎం చంద్రబాబు నేతృత్వంలో సహకార రంగాన్ని మరింత బలోపేతం చేస్తున్నారన్నారు. జిల్లా సహకార అధికారి వీరాచారి మాట్లాడుతూ సహకార సంఘాల ద్వారా రైతులకు, ఇతర రంగాల వారందరికీ సేవలందించాలని పేర్కొన్నారు. విజయవాడ సహకార శిక్షణ కేంద్రం లెక్చరర్ ఎస్ వేదాంత రెడ్డి, బ్యాంక్ సీఈవో అజయ్ కిషోర్, జీఎంలు టి.కృష్ణవేణి, వీవీఎస్ ఫణికుమార్, బ్యాంకు ఇతర ఉన్నతాధికారులు, సిబ్బంది, సహకార సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

సమాజాభివృద్ధి లక్ష్యంగా.. ఆవిష్కరణలు జరగాలి

● ఏఎన్‌యూ ఉప కులపతి ఆచార్య గంగాధరరావు



కార్యక్రమంలో మాట్లాడుతున్న వీసీ ఆచార్య గంగాధరరావు

ఏఎన్‌యూ, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): ఫార్మసిస్టులు ఆధునిక మందులను కనుగొని సమాజ అభివృద్ధికి దోహదపడాలని.. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఉపకులపతి ఆచార్య గంగాధరరావు పిలుపునిచ్చారు. బీఫార్మసీ మొదటి సంవత్సరం విద్యార్థుల ఓరియంటేషన్ కార్యక్రమం శుక్రవారం వర్సిటీలో జరిగింది.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త టెక్నాలజీని అంగీకరించి.. ప్రజల కోసం ఉత్తమ మందులను ఆవిష్కరించాలని సూచించారు. టీకాలు, మందుల తయారీలో నూతన ఆవిష్కరణ లను ప్రోత్సహించాలన్నారు. దుష్ప్రభావాలను కూడా అర్థం చేసుకోవాలి సూచించారు. అనంతరం రెక్టార్ శివరామ్ ప్రసాద్ మాట్లాడుతూ ల్యాబ్ ప్రయోగాలు సరిగా నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఓఎస్‌డీ రవికుమార్, ఫార్మసీ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎమ్మెస్సీ పరీక్ష ఫలితాలు విడుదల

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఈ ఏడాదిలో నిర్వహించిన ఎమ్మెస్సీ బోటనీ ఆరు, కెమిస్ట్రీ నాలుగు, కంప్యూటర్ సైన్స్ నాలుగు, మ్యాథమేటిక్స్ నాలుగు, ఫిజిక్స్ నాలుగు సెమిస్టర్ల, రీవాల్యుయేషన్ పరీక్ష ఫలితాలను పరీక్షల నియంత్రణ అధికారి ఆలపాటి శివప్రసాద్ రావు శుక్రవారం విడుదల చేశారు.

'ఎస్ఐఆర్'పై ముగిసిన శిక్షణ తరగతులు

● రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వివేక్ యాదవ్

అమరావతి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల సంబంధిత అధికారులకు ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)పై మంగళవారం నుంచి శుక్రవారం వరకు నాలుగు రోజులపాటు వర్చువల్‌గా శిక్షణా తరగతులు నిర్వహించినట్లు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వివేక్ యాదవ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఎస్ఐఆర్ చేపట్టాల్సిన అవసరం, కీలక దశలు, ఈఆర్‌వోలు, బీఎల్‌వోల కీలక బాధ్యతలను వివరించామన్నారు. యాప్ ద్వారా ఓటర్ల మ్యాపింగ్ విధానంపై కూడా సాంకేతిక శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. ఎన్నికల అధికారులు ఎస్ఐఆర్ ప్రక్రియను పూర్తిగా అవగాహన చేసుకుని, తమ పరిధిలోని ఏఈఆర్‌వోలకు, బీఎల్‌వోలకు సమగ్ర శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు.

ఖాతాల్లో.. రూ.కోట్లు

(5వ పేజీ తరువాయి)

అధికారులు లెక్కలు తేల్చారు. ఖాతాల్లో మూలుగుతున్న నగదును వాటి అసలు ఖాతాదారులు లేదా వారి వారసులకు అప్పగించేందుకు భారతీయ రిజర్వ్ చర్యలు చేపట్టింది. ఇందుకోసం అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్స్-గేట్‌వే టు యాక్సెస్ ఇన్ఫర్మేషన్ (ఉద్గమ్) పేరుతో ఒక ప్రత్యేక పోర్టల్ ఏర్పాటు చేసింది. ఈ పోర్టల్ ద్వారా బ్యాంకు ఎస్‌బీ/కరెంట్ అకౌంట్ ఖాతాదారులు లేదా టర్మ్ డిపాజిటర్లు లేదా వారి వారసులు ఆ ఖాతాల్లోని మొత్తాలను క్లెయిమ్ చేసుకునే అవకాశం కల్పించింది. ఈ క్రమంలో గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లా లీడ్ బ్యాంకుల అధికారులు గ్రామ, గ్రామాన ప్రత్యేక అవగాహనా కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు. ఖాతాల్లో సొమ్ము ఉండి వాటిని వెనక్కి తీసుకోని వారి కోసం జల్లెడ పడుతున్నారు. అలా అన్‌క్లెయిమ్డ్‌గా(వెనక్కి తీసుకోని) ఉన్న సొమ్ము గుంటూరు జిల్లాలోనే అక్షరాలా రూ.149 కోట్లు ఉన్నట్లు ఆర్‌బీఐ (రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా) వెల్లడించింది. జిల్లాలో 7,48,948 అన్‌క్లెయిమ్డ్ ఖాతాలు ఉన్నట్లు తెలియజేస్తుంది. బ్యాంకుల్లో అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్లు ఉంటే వాటిని రిజర్వ్ బ్యాంక్ ఆధ్వర్యంలోని డిపాజిటర్ ఎడ్యుకేషన్ అండ్ అవార్నెస్ ఫండ్‌కు బదిలీ చేస్తారు. ఆ డబ్బులను తిరిగి ఇచ్చేందుకు, చట్టపరమైన వారసులను గుర్తించేందుకు ఆర్‌బీఐ వివిధ రకాల చర్యలు తీసుకుంటోంది. ఇందుకోసం సెంట్రలైజ్డ్ వెబ్ పోర్టల్ udgam.rbi.org.in (అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్స్ గేట్ వే టూ యాక్సెస్ ఇన్ఫర్మేషన్) అందుబాటులోకి తెచ్చింది.

పదేళ్ల పాటు నిర్వహణలో లేకపోతేనే..

బ్యాంకులోని ఏదైనా ఎస్‌బీ/కరెంట్ ఖాతాను పదేళ్ల పాటు నిర్వహణ చేయకపోతే బ్యాంకులు దాన్ని ఇన్‌ఆపరేటివ్ ఖాతాగా పరిగణించి ఆ ఖాతాలోని మొత్తాన్ని ఆర్‌బీఐ నిర్వహించే డిపాజిటర్ ఎడ్యుకేషన్ అండ్ అవేర్‌నెస్(డీఈఏ) ఫండ్‌కు బదిలీ చేస్తాయి. గడువు దాటిన పదేళ్లలోపు వెనక్కి తీసుకోని టర్మ్ డిపాజిట్లను కూడా అన్‌క్లెయిమ్‌డ్ డిపాజిట్లుగా పరిగణించి డీఈఏ ఫండ్‌కు మళ్లిస్తారు. వాణిజ్య, సహకార బ్యాంకుల్లోని ఖాతాలకూ ఈ నిబంధన వర్తిస్తుంది.

నామినీలకు నగదు చెల్లింపు

బ్యాంకుల్లో సొమ్ము డిపాజిట్ చేసిన తర్వాత కొందరు హఠాత్తుగా మరణిస్తూ ఉంటారు. ఆ వివరాలు కుటుంబ సభ్యులకు చాలా సందర్భాల్లో తెలిసే అవకాశం ఉండదు. అటువంటి ఖాతాల వివరాలు తెలుసుకునేందుకు ఆర్‌బీఐ పోర్టల్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఆ పోర్టల్‌లోకి వెళ్లి వివరాలు నమోదు చేస్తే వారి పేరుతో నగదు ఎక్కడ, ఏ ఖాతాలో ఉన్నా తెలుస్తుంది. ఆ తర్వాత సంబంధిత బ్యాంకు అధికారులను కలిస్తే నామమాత్రపు డాక్యుమెంట్లు అందజేసి నగదు వెనక్కు తీసుకోవచ్చు. కొంతమంది అనేక బ్యాంకుల్లో ఖాతాలు ఉన్నా వాటిని వినియోగించరు. ఆయా ఖాతాల్లో ఉన్న నగదు కూడా వెనక్కి తీసుకునే అవకాశం ఆర్‌బీఐ కల్పించింది.

అమరావతికి.. పెట్టుబడుల వరద

(5వ పేజీ తరువాయి)

ఉన్నట్లుగా అంచనా. ఈ నేపథ్యంలో ఒప్పందం చేసుకున్న సంస్థలు సాధ్యమైనంత త్వరగా పెట్టుబడులు పెట్టేలా చూసే బాధ్యత అటు ప్రభుత్వం, ఇటు సీఆర్‌డీఏ తీసుకోవాల్సి ఉంది. జాతీయ, అంతర్జాతీయ సంస్థలు అమరావతి రాజధానిలో పెట్టుబడులు పెట్టేందుకు సీఆర్‌డీఏతో ఒప్పందం చేసుకోవడంతో వాటి నిర్మాణ దశ, పూర్తి అయిన తర్వాత వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. అలానే అనుబంధంగా ఆయా సంస్థలకు ముడిసరుకులు సరఫరా చేసే సంస్థల ద్వారా కూడా ఉద్యోగాలు లభిస్తాయని అధికారవర్గాలు తెలిపాయి.

రూ.250 కోట్ల పెట్టుబడితో టైటాన్

రాజధాని అమరావతిలో మరో సంస్థ కొలువుదీరనున్నది. ముంబైకి చెందిన టైటాన్ ఇన్‌టెక్ సంస్థ ఎలక్ట్రానిక్స్ డిస్‌ప్లే తయారీ సంస్థను అమరావతి పరిధిలో ఏర్పాటు చేయడానికి ఆంధ్రప్రదేశ్ ఎకనామిక్ డెవలప్‌మెంట్ బోర్డు (ఏపీఈడీబీ)తో శుక్రవారం ఒప్పందం చేసుకుంది. విద్యుత్ ఉపకరణాలకు అవసరమైన అత్యాధునిక డిస్‌ప్లే తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నది. రూ.250 కోట్ల పెట్టుబడితో 20 ఎకరాల్లో సంస్థను ఏర్పాటు చేస్తామని దక్షిణ కొరియాకు చెందిన ప్రతినిధులు తెలిపారు. ఇక్కడ మినీ, మైక్రో ఎల్ఈడీ బ్యాక్‌లిడ్ మాడ్యూల్స్, అడ్వాన్స్‌డ్ కంట్రోలర్లు, 2డీ/3డీ వీడియో ఇంజన్లు రూపొందిస్తారు.

స్వగృహం.. శిథిలం

(5వ పేజీ తరువాయి)

పరిస్థితుల్లో నిర్వహిస్తున్నారు.

ప్రభుత్వం స్పందించాలి

ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్‌కు గత ప్రభుత్వం ఆమోదం తెలిపింది. అయితే ప్రస్తుతం కలెక్టరేట్‌కు పక్కనే ఉన్న స్వగృహ భవనాలకు మౌలిక వసతులు కల్పిస్తే పోలీసు శాఖతో పాటు అన్ని శాఖల జిల్లా కార్యాలయాలను ఏర్పాటు చేసే అవకాశం ఉంది. కొత్త భవనాలు నిర్మించే కన్నా ఉన్న భవనాలు వినియోగంలోకి తీసుకువస్తే ప్రభుత్వానికి నిధులు ఆదా అవుతాయి. ఈ దిశగా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని జిల్లావాసులు కోరుతున్నారు. ఈ మేరకు ఎమ్మెల్యేలు, ఎంపీ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పందిస్తే జిల్లా కార్యాలయాలకు భవనాల సమస్య త్వరతగతిన పరిష్కారం అవుతుంది. కలెక్టర్ కృతికాశుక్లా స్వగృహ భవనాల వినియోగంపై దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

మందుబాబులకు అడ్డగా భవనాలు

ఎస్పీ కార్యాలయం సమీపంలో ఉన్న స్వగృహ భవనాలు మందు బాబులకు అడ్డగా మారాయి. ఇక్కడ యథేచ్ఛగా అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నాయి. అయినా పోలీసులు ప్రేక్షకపాత్ర వహిస్తున్నారన్న విమర్శలున్నాయి. తాగునీరు, డ్రెయినేజ్ కోసం ఏర్పాటు చేసిన పైపులను కూడా అపహరించుకుపోయారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.6.00 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	122, 132, 142
చికెన్ విత్ స్కిన్(కిలో)	230.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	240.00

జిల్లా హాకీ జట్టుకు.. 'ఎస్ఎస్ఎన్' విద్యార్థి ఎంపిక



షేక్ అమిత్ (ఫైల్ ఫొటో)

నరసరావుపేట టౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఎస్ఎస్ఎన్ కళాశాల విద్యార్థి షేక్ అమిత్ ఉమ్మడి గుంటూరు జిల్లా హాకీ జట్టుకు ఎంపిక అయ్యాడని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంఎస్ సుధీర్ శుక్రవారం తెలిపారు. నందిగామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ నెల 10న జరిగిన అండర్-19 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీలలో ప్రతిభ చాటి ఈ ఘనత సాధించాడన్నారు. ఈ నెల 22న విశాఖపట్నంలో రాష్ట్రస్థాయిలో జరిగే అంతర జిల్లాల హాకీ పోటీలలో గుంటూరు జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తాడన్నారు. షేక్ అమిత్‌ను కళాశాల పాలకవర్గ అధ్యక్షుడు కపలవాయి విజయకుమార్, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్, మాజీ మున్సిపల్ చైర్మన్ నాగసరపు సుబ్బరాయగుప్త, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.శ్రీనివాస సాయి, పీడీ డాక్టర్ యక్కల మధుసూదనరావు అభినందించారు.

40,126 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు శుక్రవారం 34,160 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 40,026 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 7,698 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఆర్మూరు	10000	13500
334	10000	17300	ఏసీ కామన్ వెరైటీ		
నెంబరు. 5	10000	15000	334	10500	17000
273	10500	14000	నెంబరు. 5	10000	15200
341	10000	17000	273	----	----
4884	----	----	341	10000	17500
సూపర్ 10	----	----	4884	11000	14500
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10000	16000	తేజ	10000	15300
షార్క్-1	----	----	బ్యాడిగి	10000	17500
బ్యాడిగి	10500	17500	దేవనూరు డీలక్స్	10500	16500
దేవనూరు డీలక్స్	10500	16400	తాలుకాయలు	5000	8800

వ్యవసాయ, డ్వాక్రా రుణాలకు ప్రాధాన్యం

● సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆర్ఎం



మాట్లాడుతున్న ఆర్ఎం వెంకటేశ్వరరావు

వేమూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ పరిధిలోని 12 జిల్లాల్లో ఈ ఆర్థిక సంవత్సరానికి రూ.3,574 కోట్ల రుణాలు మంజూరు చేసినట్లు బ్యాంక్ రీజినల్ మేనేజర్ వెంకటేశ్వరరావు తెలిపారు. శుక్రవారం వేమూరు, చదలవాడ బ్రాంచ్‌ల పరిధిలోని డ్వాక్రా గ్రూపులకు రూ. కోటి రుణాలను పంపిణీ కార్యక్రమాన్ని వేమూరులో నిర్వహించారు. జోనల్ పరిధిలో రుణాలు మంజూరును పరిశీలిస్తే తమ బ్యాంకు అగ్రస్థానంలో గుర్తింపు పొందిందని ఆర్ఎం ఈ సందర్భంగా తెలిపారు. గతేడాది రూ. 3 వేల కోట్ల రుణాలు ఇచ్చామని తెలిపారు. వీటిలో డ్వాక్రా రుణాలురూ.300 కోట్లు, వ్యవసాయ రుణాలు రూ.1,980 కోట్లు మంజూరు చేసినట్లు వెల్లడించారు. డిసెంబరు నెలాఖరులోగా రుణాలు పొందే వారికి ప్రాసెసింగ్ చార్జీలు రద్దు చేయడం జరిగిందన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ రైస్ మిల్లులు, పౌల్ట్రీలు, గిడ్డంగులు నిర్మాణాలకు రూ.7.90 వడ్డీకి రుణాలను అందిస్తున్నామన్నారు. వేమూరు, చదలవాడ బ్రాంచ్‌ల పరిధిలో రైస్ మిల్లులు, ఫుడ్ ప్రాసెసింగ్ ప్రాజెక్టుల నిర్మాణాలకు ముందుకు వస్తే వారికి రుణ సదుపాయం కల్పించి సహకరిస్తామన్నారు. ఈ రెండు బ్రాంచ్‌ల పరిధి నుంచి ఐదు గ్రూపులకు చెందిన 50 మంది డ్వాక్రా మహిళలకు ఒక్కొక్కరికి రూ.2 లక్షలు చొప్పున రూ.కోటి రుణాన్ని మంజూరు చేసినట్లు తెలిపారు. వివిధ పథకాల గురించి డ్వాక్రా మహిళలు రైతులు, వ్యాపారులకు సదస్సు నిర్వహించి అవగాహన కల్పించారు. చీఫ్ మేనేజర్ కృష్ణప్రసాద్, ఫీల్డ్ ఆఫీసర్ హరీష్, ఎంపీడీవో పెద్దింటి రవికుమార్, మండల వ్యవసాయ శాఖ అధికారి ప్రేమ్‌సాగర్, ఏపీఎం శోభన్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ సెంటర్లను బలోపేతం చేయాలి

అమరావతి, నవంబరు 14(ఆంధ్ర జ్యోతి): అంగన్వాడీ సెంటర్ల బలోపేతానికి చర్యలు తీసుకోవాలని రాష్ట్ర అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ డిమాండ్ చేసింది. ప్రీస్కూల్ పిల్లలకు కూడా 'తల్లికి వందనం' ఇవ్వాలని, లబ్ధిదారులకు ఎఫ్ఆర్ఎస్‌ను రద్దు చేయాలని పేర్కొంది. ఈ మేరకు శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా సచివాలయాల్లో వినతిపత్రాలు అందజేసింది. ప్రీస్కూల్ పిల్లలు తగ్గిపోతున్నారన్న కారణం చూపి.. అంగన్వాడీ సెంటర్ల విలీనానికి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు బేబిరాణి, సుబ్బరావమ్మ అన్నారు. మెనూ పరిమాణాన్ని కూడా పెంచాలని డిమాండ్ చేశారు.

రబీలో ఆరుతడి పంటలే వేయండి

● కృష్ణా డెల్టా సిస్టమ్ చీఫ్ ఇంజనీర్ సూచన

అమరావతి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): రబీ కాలంలో కృష్ణా డెల్టా పరిధిలో ఆరుతడి పంటలు మాత్రమే వేయాలని రైతులకు కృష్ణా డెల్టా సిస్టమ్ చీఫ్ ఇంజనీర్ సూచించారు. నాగార్జునసాగర్‌లో నీటి నిల్వలు తక్కువగా ఉన్నందున వరి పంటకు ప్రత్యామ్నాయంగా ఆరుతడి పంటలను సాగు చేయాలన్నారు. మొత్తంగా 228 టీఎంసీల కృష్ణా జలాలకుగాను ప్రస్తుతం 158 టీఎంసీలు మాత్రమే ఉన్నాయని పేర్కొన్నారు. భవిష్యత్తులో నదీ ప్రవాహం తగ్గితే.. వరి పంటకు సాగునీరు అందే పరిస్థితి ఉండదని హెచ్చరించారు. వరి పంట వేస్తే తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని పేర్కొన్నారు.

విద్యుత్ విజిలెన్స్ అధికారుల దాడులు

● రూ 1.74 కోట్ల అపరాధ రుసుం విధింపు

మాచవరం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు. నిబంధనలను అతిక్రమించిన వారికి రూ.1.74 కోట్ల అపరాధ రుసుం విధించినట్లు మాచర్ల డీఈఈ వీరేశ్వరరావు తెలిపారు. కొత్త గణేషునిపాడు, పిల్లుట్ల, పిన్నెల్లి, మోర్జంపాడు, కొత్తపాలెం, గోవిందాపురం, తురకపాలెం, మోర్జంపాడు గ్రామాల్లో 145 మంది 49 బృందాలుగా 5,397 సర్వీసులను తనిఖీ చేసినట్లు వెల్లడించారు. ఈ తనిఖీల్లో 11 మందికి రూ. 12 లక్షలు, ఎనిమిది మందికి రూ.65 లక్షలు, నలుగురికి రూ.4 లక్షలు, 31 మందికి రూ.93 లక్షలు అపరాధ రుసుం విధించినట్లు తెలిపారు. ఈ దాడుల్లో డీఈఈలు శ్రీనివాసరావు, రవికుమార్, మల్లికార్జున ప్రసాదు, జేఈ భగవాన్, ఏఈఈలు కోటేశ్వరరావు, సతీష్‌కుమార్, శివశంకర్, మాచర్ల సబ్ డివిజన్ పరిధిలోని డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

కర్లపాలెం కానిస్టేబుల్‌కు జూడోలో గోల్డ్‌మెడల్



నరేంద్రను అభినందిస్తున్న ఎస్పీ

బాపట్ల, నవంబరు 14(ఆంధ్రజ్యోతి) : ఆలిండియా పోలీసు జూడో క్లస్టర్‌లో కర్లపాలెం కానిస్టేబుల్ వీరంకి నరేంద్ర గోల్డ్‌మెడల్ సాధించారు. పెన్‌కాక్ సిలాట్ విభాగంలో జిల్లా ఖ్యాతిని జాతీయ స్థాయిలో ఇనుమడింపజేశారని.. కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్, ఎస్పీ బి.ఉమామహేశ్వర్ నరేంద్రను శుక్రవారం వారి కార్యాలయాల్లో అభినందించారు. 2018, 2024, 2025 లో జాతీయస్థాయిలో జరిగిన పలు క్రీడా పోటీల్లో పాల్గొని.. పెన్‌కాక్ సిలాట్ విభాగంలో మెడల్స్ సాధించినట్లు నరేంద్ర తెలిపారు. నరేంద్ర రాబోయే రోజుల్లో మంచి శిక్షణ పొంది అంతర్జాతీయ స్థాయిలో సత్తా చాటాలని ఆకాంక్షించారు. పోలీసు విభాగంలో ప్రతిభావంతులైన క్రీడాకారులను ప్రోత్సహిస్తామని ఎస్పీ పేర్కొన్నారు.

కౌలు రైతు ఆత్మహత్య



రామాంజనేయులు (ఫైల్ ఫొటో)

మాచవరం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ తట్టుకోలేక, పంటలు పండక కౌలు రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల కేంద్ర మైన మాచవరంలో చోటు చేసుకుంది. ఎస్ఐ తిరుపతిరావు శుక్రవారం వివరాలను వెల్లడించారు. మాచవరం గ్రామానికి చెందిన గడ్డం రామాంజనేయులు(25) ఈ నెల 11న గండిమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గుంటూరులోని ఓ ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందుతూ గత గురువారం మరణించాడు. రామాంజనేయులు నాలుగు ఎకరాలు పొలం కౌలుకు తీసకొని.. దానిలో రెండు ఎకరాలు పత్తి, రెండు ఎకరాలు మిర్చి, సాగు చేస్తున్నాడు. ఇటీవల తుఫాన్‌కు పంట పూర్తిగా పాడైపోయింది. దీనికి తోడు గతంలో కొంత అప్పులు ఉన్నాయి. దీంతో మనస్థాపానికి గురైన రామాంజనేయులు ఆత్మహత్య చేసకున్నాడు. మృతుడి భార్య మాధవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

ఏపీని పెట్టుబడులకు గేట్ వేగా.. మార్చిన ఘనత చంద్రబాబు, లోకేశ్ లదే : ప్రత్తిపాటి

చిలకలూరిపేట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఏపీని పెట్టుబడులకు గేట్ వేగా మార్చిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్‌దేనని స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు శుక్రవారం పేర్కొన్నారు. విశాఖ సీఐఐ సదస్సు ప్రారంభానికి ముందే వారిద్దరి సమక్షంలో రూ.3.50 లక్షల కోట్ల పెట్టుబడులకు ఎంఓయూలు జరగడం పారిశ్రామికవేత్తలకు ఉన్న అపారమైన నమ్మకానికి నిదర్శనమని చెప్పారు. పనిచేసే ప్రభుత్వం ఉంటే ప్రజలకు, రాష్ట్రానికి ఎలాంటి మేలు జరుగుతుందో చెప్పడానికి చంద్రబాబు, లోకేశ్, పవన్ కల్యాణ్ నాయకత్వమే నిదర్శనమన్నారు. ప్రభుత్వ వేగం చూస్తుంటే రాబోయే రెండేళ్లలోనే 20లక్షల ఉద్యోగాల హామీ నెరవేరే అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. బిహార్ ఎన్నికల ప్రచారంలో లోకేశ్ అడుగు పెట్టినప్పుడే ఎన్డీయే విజయపరంపర మొదలైందన్నారు.

పెట్టుబడుల దిశను మార్చే చారిత్రాత్మక వేదిక

● టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి

నరసరావుపేట టౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ పెట్టుబడుల దిశను మార్చే చారిత్రాత్మక వేదికగా విశాఖ సమ్మిట్ నిలుస్తుందని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రాన్ని పెట్టుబడుల హబ్‌గా మార్చేందుకు సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్ వ్యూహాత్మంగా శ్రమిస్తున్నారో చెప్పడానికి సీఐఐ బాగస్వామ్య సదస్సు ఉదాహరణగా నిలుస్తుందన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కేవలం 17 నెలలలోనే రాష్ట్రంలో పెట్టుబడుల ప్రవాహం మొదలైందని, ఇప్పటి వరకు రూ.9.50 లక్షల పెట్టుబడులు వచ్చాయన్నారు. మంత్రి నారా లోకేశ్ విదేశీ పర్యటనలు, గ్లోబల్ రోడ్ షోలు, పెట్టుబడిదారులతో ప్రత్యక్ష చర్చలు నిర్వహిస్తూ పెట్టుబడులను ఆకర్షిస్తున్నారని అన్నారు. ఫలితంగా విశాఖలో గూగుల్ రూ1.33 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టబోతుందన్నారు.

పల్నాడు వార్తలు

మాచర్ల ◆ గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు

జీవన శైలిలో మార్పులు చేసుకోవాలి

సత్తెనపల్లి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): జీవని శైలిలో మార్పుల ద్వారా డయాబెటిక్‌ను నివారించవచ్చని ఏరియా వైద్యశాల డాక్టర్ గిరిరాజు అన్నారు. శుక్రవారం ప్రపంచ డయాబెటిస్ దినోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడుతూ సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు వస్తున్న రోగుల్లో 15శాతం మంది డయాబెటిస్ బాధితులేనన్నారు. జీవన శైలిలో మార్పులు చేసుకుంటే షుగర్ వ్యాధి దరి చేరదన్నారు. మందులపై ఆధార పడకుండా తమ ఆహార అలవాట్లపై దృష్టి సారించాలన్నారు. జంక్‌ఫుడ్స్ పూర్తిగా మానేయాలన్నారు. ఒత్తిడి తగ్గించుకోవటం, సరైన నిద్రవల్ల ఇన్సులిన్ మెరుగు పడుతుందన్నారు.

ఘన, ద్రవ వ్యర్థాలపై శిక్షణ

వెల్దుర్తి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): అసిస్ట్ ఐటీసీ ఆధ్వర్యాన వెల్దుర్తి మండలం పరిషత్ కార్యాలయంలో ఘన, ద్రవ వ్యర్థాలపై శుక్రవారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అసిస్ట్ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామాల్లో ఉత్పత్తి అయ్యే ఘన, ద్రవ వ్యర్థాలను వేర్వేరుగా సేకరించాలన్నారు. వ్యర్థాలను రోడ్లపై పడవేయకుండా స్వచ్ఛ రహదారుల డంపింగ్ యార్డుకు తరలించాలన్నారు. తడి, పొడి వ్యర్థాలను ఎరువులుగా తయారు చేయడంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ సంజీవరెడ్డి, ఎంపీడీవో సాంబశివరావు, బాలకోటయ్య, అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత ఎస్ఐ కోట ఆదినారాయణ మృతి

దాచేపల్లి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): రిటైర్డు ఎస్ఐ కోట ఆదినారాయణ(88) శుక్రవారం వయోభారంతో మృతిచెందారు. మృతుడు ఆదినారాయణ స్వగ్రామం దాచేపల్లి మండలం కేసానుపల్లి. మృతదేహానికి విశ్రాంత ఉద్యోగులు, వివిధ పార్టీల నేతలు నివాళులర్పించారు.

నేడు స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర

పిడుగురాళ్ల, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని లెనిన్‌నగర్ హైస్కూల్ వద్ద శనివారం స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమంలో ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు పాల్గొనున్నారని కమిషనర్ ఐ శ్రీనివాసులు తెలిపారు.

కార్పొరేట్ చేతుల్లోకి అసైన్డ్ భూములు

సత్తెనపల్లి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): పేదల అసైన్డ్ భూములను కార్పొరేట్‌లకు అప్పజెప్పే ప్రక్రియను ప్రభుత్వం వేగవంతం చేయటాన్ని ఖండిస్తున్నామని పౌర హక్కుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వీ ప్రభాకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో 36లక్షలకు పైగా అసైన్డ్ భూమి ఉందని, ఫ్రీహోల్డ్‌కు అవసరమైన భూములు 13లక్షల ఎకరాలకు పైగా ఉందని తెలిపారు. ఇప్పటికే 9 లక్షల ఎకరాలకు పైగా భూమిని ప్రభుత్వం ఫ్రీహోల్డ్ చేసిందన్నారు. మొత్తం మీద విద్యుత్ పునరుత్పత్తి ప్రాజెక్టులకు 26 లక్షల ఎకరాల భూములను లీజుకు ఇచ్చేందుకు ప్రభుత్వ జీవోకు ఆర్డినెన్స్ కూడా జారీ చేసిందన్నారు. దీనివల్ల పేద ప్రజలు ఎంతగానో నష్ట పోతారన్నారు.

నేడు విగ్రహావిష్కరణ

సత్తెనపల్లి రూరల్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): విద్యా ప్రదాత, రెంటపాళ్ళ హైస్కూల్ ఫౌండర్ మక్కపాటి వెంకట మురహరిరావు విగ్రహావిష్కరణ ఈనెల 15వ తేదీ శనివారం రెంటపాళ్ళ జెడ్పీ హైస్కూల్‌లో జరుగుతుందని మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ మక్కపాటి రామచంద్రరరావు శుక్రవారం తెలిపారు.

ప్రసన్నాంజనేయస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

మండలంలోని కట్టావారిపాలెంలో కొలువైన్న శ్రీప్రసన్నాంజనేయస్వామి 15వ వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా వేకువజాము నుంచే ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం భారీ అన్నదానం జరిగింది.

ప్లాస్టిక్ కవర్లు స్వాధీనం

సత్తెనపల్లి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు షాపులపై శుక్రవారం మునిసిపల్ కమిషనర్ ఆనంద్‌కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ విజయసారథి ఆధ్వర్యంలో సచివాలయ ఉద్యోగులు దాడులు నిర్వహించారు. నిషేధిత ప్లాస్టిక్ కవర్లను, గ్లాసులను స్వాధీనం చేసుకున్నారు.75 మైక్రాన్‌ల కంటే ఎక్కువ మందం గల ప్లాస్టిక్‌కవర్లను వాడరాదని దుకాణదారులకు తెలిపారు.

జిల్లా స్థాయి సాఫ్ట్ టెన్నిస్ పోటీల్లో క్రోసూరు విద్యార్థి ప్రతిభ

క్రోసూరు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): 69వ అంతర్ జిల్లాల క్రీడా పోటీల్లో అండర్-19 బాలుర సాఫ్ట్ టెన్నిస్ విభాగంలో క్రోసూరు జడ్పీ హైస్కూల్ విద్యార్థి కుంభా కృష్ణారావు ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు హెచ్ఎం దుగ్గి బాబూరావు తెలిపారు. శ్రీకాకుళం జిల్లా పాపపట్నంలో జరిగిన పోటీల్లో ఉమ్మడి గుంటూరు జిల్లా జట్టుకు ప్రథమస్థానం లభించిందని, జట్టులో కృష్ణారావు ఉత్తమ ప్రతిభ కనబరిచాడన్నారు. విద్యార్థిని పీఈటీ ముప్పా నరసింహారావు, ఇతర ఉపాధ్యాయులు అభినందించారు.

నేడు క్రోసూరులో ప్రజా దర్బార్

క్రోసూరు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ ఆధ్వర్యంలో శనివారం ఉదయం 10 గంటల నుంచి 2వరకు క్రోసూరు మండల పరిషత్ కార్యాలయంలో ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో పీ రవికుమార్ తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు తమ సమస్యలను విన్నవించవచ్చన్నారు.

నిజాయితీగా ఓటుహక్కు వినియోగించుకోవాలి

పెదకూరపాడు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ప్రలోభాలకు లోనుకాకుండా నిజాయితీగా ఓటుహక్కును వినియోగించుకున్నప్పుడే ప్రజాస్వామ్య ప్రభుత్వాలు ఏర్పడతాయని కాకతీయ కళాశాల ప్రిన్సిపల్ పీ అశోక్‌బాబు అన్నారు. పెదకూరపాడు మండలంలోని లగడపాడు, కన్నెగండ్ల గ్రామాల్లో కాకతీయ జూనియర్ డిగ్రీ కళాశాలల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ఓటు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆయా గ్రామాల్లో జరిగిన కార్యక్రమాల్లో సర్పంచ్‌లు వేమవరపు నాగేశ్వరరావు, వెంకట్రామయ్య, ఎన్ఎస్ఎస్ అధికారులు షేక్ కరీం, ఎం వందనం తదితరులు పాల్గొన్నారు.

18న మెగా జాబ్‌మేళా

మాచర్ల, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎస్‌కేబీఆర్ డిగ్రీ కళాశాలలో ఈనెల 18వ తేదీన డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యాన రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎస్‌కేబీఆర్ డిగ్రీ కళాశాల నేతృత్వంలో మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి తమ్మాజీరావు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె లక్ష్మీకుమారి తెలిపారు. శుక్రవారం వారు మాట్లాడుతూ జాబ్ మేళాలో 10 కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారన్నారు. వివరాలకు సెల్ : 7842747682, 9492158153లో సంప్రదించాలన్నారు.

పక్కా గృహాల కోసం సర్వే: ఏఈ మరియదాసు

మాచర్ల రూరల్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామాల్లో పక్కా గృహాలు కావాల్సిన వారికోసం సర్వే జరుగుతుందని హౌసింగ్ ఏఈ మరియదాసు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ గృహాలు నిర్మించుకునే చోట జియోట్యాగింగ్ చేయించుకోవాలన్నారు. ఈనెల 30వ తేదీలోగా సర్వే ముగుస్తుందన్నారు.

దళితుల ఆత్మగౌరవ ప్రదర్శనను జయప్రదం చేయండి

దుర్గి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయిపై జరిగిన దాడిని నిరసిస్తూ ఈనెల 17న ఢిల్లీలో జరగనున్న దళితుల ఆత్మగౌరవ ప్రదర్శనను జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కందుకూరి రమేష్ కోరారు. శుక్రవారం దుర్గిలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో మాచర్ల రూబెన్, ఊరే మార్కు, తాలూరి యాకోబు, కోట దాసు, నాగెండ్ల కోటయ్య, ఆనందరావు, చాట్ల మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన పేదలందరికీ ఇళ్లు

● ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్


లేమల్లెలో ఇంటి యజమానితో గృహప్రవేశం చేస్తున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

అమరావతి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అర్హులైన పేదలందరికి ఇంటిని నిర్మించుకునేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. శుక్రవారం లేమల్లెలో పీఎంఏవై పథకం కింద నిర్మించిన క్రోసూరి శ్రీదేవి ఇంటిని ఆయన గృహప్రవేశం చేసి వారికి అభినందనలు తెలిపారు. అనంతరం ఎంఎల్‌ఏ ప్రవీణ్ మాట్లాడుతూ నియోజకవర్గంలో 1213 ఇండ్లను పూర్తి చేశామన్నారు. 2029కి ఇల్లు లేని పేదలు ఉండకూడదని, అర్జీ పెట్టుకున్న అర్హులైన వారికి ఇంటి నిర్మాణం పూర్తి చేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో గృహ నిర్మాణశాఖ పీడీ బండారు శివలింగం, ఈఈ ప్రసాద్, ఎన్ వెంకట్రావు, తహసీల్దార్ డానియేలు, ఎంపీడీఓ పార్వతి, సర్పంచ్ ఉగ్గం పున్నమ్మ, నియోజకవర్గ పరిశీలకులు నల్లపాటి రాము, నరుకుళ్లపాడు, మునగోడు పీఏసీఎస్ చైర్‌పర్సన్‌లు భాష్యం జగదీష్, నాగోతు నాగార్జున, కూటమి నాయకులు పాల్గొన్నారు.

క్షేత్ర స్థాయి నుంచి టీడీపీ అభ్యున్నతికి కృషి చేయండి

అమరావతి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి) క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు, గ్రామపార్టీ అధ్యక్షులు, బూత్ కన్వీనర్‌లు, కమిటీ సభ్యులు క్షేత్ర స్థాయి నుండి టీడీపీ అభ్యున్నతికి కృషి చేయాలని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. శుక్రవారం స్థానిక జేబీ గార్డెన్స్‌లో వివిధ పార్టీ పదవులు పొందిన నాయకుల ప్రమాణస్వీకార కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. నియోజకవర్గ పరిశీలకులు నల్లపాటి రాము ఇన్‌చార్జిలతో ప్రమాణం చేయించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ నాయకులు ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను పరిష్కరించాలన్నారు. పార్టీలో గ్రూపు రాజకీయాలకు తావులేకుండా అందరిని కలుపుకుపోయే లా నాయకులు నడుచుకోవాలన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు వెన్నా సాంబశివారెడ్డి, కిలారి రాజన్‌బాబు, నాయిబ్రాహ్మణ కార్పొరేషన్ డైరక్టర్ మద్దిరాల గంగాధర్, గ్రంధాలయ పరిషత్ డైరక్టర్ ఏపూరి నాగేశ్వరరావు, సూక్ష్మపరిశ్రమల సంస్థ డైరక్టర్ జి చినరాజు, కె.వసంతరావు, ఐదు మండలాల పార్టీ అధ్యక్షులు ఎం రాజ, ఏటుకూరి బ్రహ్మయ్య, ఎన్ ఆశీర్వాదం, వెంకటరెడ్డి, మొగల్‌జాన్, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు, బూత్ కన్వీనర్‌లు పాల్గొన్నారు.


ప్రమాణస్వీకారోత్సవంలో ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్, నల్లపాటి రాము తదితరులు

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

గురజాలటౌన్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): ప్రపంచ మధుమేహ దినోత్సవం సందర్భంగా వాగ్దేవి ఫార్మసీ కళాశాల సహకారంతో పట్టణంలోని శ్రీపాతపాటేశ్వరి అమ్మవారి దేవస్థానం వద్ద శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో రక్తపరీక్షలు చేసి మధుమేహంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కమిషనర్ శివన్నారాయణ, కళాశాల నిర్వాహకులు నవులూరి పుల్లయ్య, అనంతరామయ్య, ఉల్లి సుబ్బారావు, ప్రిన్సిపాల్ కిషోర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

మైక్రో ఫైలేరియా రక్త పరీక్షలు

గురజాలటౌన్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): మైక్రో ఫైలేరియా సర్వేలో భాగంగా శుక్రవారం రాత్రి మూడో సచివాలయం పరిధిలో వైద్య సిబ్బంది వీధి వీధిన తిరుగుతూ ప్రజల నుంచి రక్త నమూనాలను సేకరించారు. ఈ పరీక్షలను రాత్రి పూట మాత్రమే చేయడం వల్ల మంచి ఫలితం వస్తుందని వైద్య సిబ్బంది తెలిపారు. పాజిటివ్‌గా నిర్ధారణ జరిగితే వారికి వెంటనే వైద్య సేవలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ మండల మహిళా అధ్యక్షురాలిగా లక్ష్మి

రెంటచింతల, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): టీడీపీ మండల నూతన కార్యవర్గాన్ని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి శుక్రవారం ప్రకటించినట్లు మండల అధ్యక్షులు అబ్బిరెడ్డిచెప్పారు. మండల మహిళా అధ్యక్షురాలిగా చీకటి వెళాంగ లక్ష్మీ, ప్రధాన కార్యదర్శిగా పోట్ల సతీష్, తెలుగు యువత అధ్యక్షుడిగా లింగయ్య యాదవ్, బీసీ సెల్ చైర్మన్‌గా బోయిన మల్లయ్య యాదవ్, ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా జ్ఞానయ్య, ఎస్టీసెల్ అధ్యక్షుడిగా ముని నాయక్, ముస్లిం మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా జాన్‌ను నియమించారు.

నేడు పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభం

క్రోసూరు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): క్రోసూరు వ్యవసాయ మార్కెట్ యార్డులో శనివారం ఉదయం 9 గంటలకు పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభమవుతుందని యార్డు కార్యదర్శి ఈశ్వరరావు తెలిపారు. రైతులు 8నుంచి 12శాతం లోపు తేమ ఉన్న పత్తిని కేంద్రాలకు తెచ్చి మంచి ధర పొందవచ్చన్నారు. రైతులు ముందుగా కపాస్ కిసాన్ యాప్‌లో తమ స్లాటు బుక్ చేసుకుని, ఆ తేదీల్లో మాత్రమే పత్తిని తీసుకురావాలన్నారు.

యజమానులకు శాశ్వత హక్కు పత్రాలు జారీ

● డిప్యూటీ ఎంపీడీవో యమున


మాట్లాడుతున్న డిప్యూటీ ఎంపీడీవో యమున

నకరికల్లు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): స్వమిత్వ గ్రామసభ ద్వారా యజమానులకు శాశ్వతహక్కు పత్రాలు జారీ చేస్తున్నట్టు డిప్యూటీ ఎంపీడీవో కే యమున తెలిపారు. శుక్రవారం నరసింగపాడు పంచాయతీ పరిధిలో గృహాలు, ఖాళీ స్థలాలకు స్వమిత్వ సర్వేలో భాగంగా గ్రామసభ నిర్వహించారు. ఈ గ్రామసభలో ఇంటి యాజమానుల, స్థల యజమానుల నుంచి వచ్చిన ఫిర్యాదులను స్వీకరించారు. కొలతలు సరి చూసుకొనేందుకు ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. తేడాలు ఉన్న యజమానులు అర్జీలను అందజేశారు. కార్యక్రమంలో పీఎస్ కొమ్మవరపు అప్పారావు, సర్పంచ్ సంగు రామకోటమ్మ, వైస్ ఎంపీపీ మేడం ప్రవీణ్ కుమార్‌రెడ్డి, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా చూడాలి


సమావేశంలో మాట్లాడుతున్న న్యాయాధికారి విజయ కుమార్‌రెడ్డి

సత్తెనపల్లి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): డిసెంబరు 13న జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువగా కేసులు పరిష్కారం అయ్యేలా పోలీసు అధికారులు చూడాలని సీనియర్ సివిల్ జడ్జి విజయకుమార్ రెడ్డి అన్నారు. పట్టణంలోని కోర్టు ఆవరణలో శుక్రవారం డిసెంబరులో జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌పై సమీక్ష నిర్వహించారు. రాజీమార్గమే రాజమార్గమని, కక్షిదారులకు తెలియజేయాలన్నారు. స్టేషన్‌ల వారీగా రాజీ పడదగిన కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో న్యాయమూర్తులు పీ ప్రియదర్శిని, జే సుజన్‌కుమార్, డీఎస్పీ ఎం హనుమంతరావు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

మాచర్ల రూరల్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని న్యాయాధికారి ప్రశాంత్ అన్నారు. బాలల దినోత్సవం సందర్భంగా పట్టణంలోని శ్రీచైతన్య టెక్నో స్కూల్‌లో నిర్వహించిన న్యాయ అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. విద్యార్థులకు విద్యాహక్కు చట్టంపై అవగాహన కల్పించారు.

● మాచర్ల, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో డిసెంబరు 13న జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసుల పరిష్కారానికి న్యాయవాదులు, పోలీసులు కృషి చేయాలని మండల న్యాయ సేవా కమిటి చైర్మన్ శ్రీనివాస్ కల్యాణ్ సూచించారు. శుక్రవారం స్థానిక కోర్టులో బ్యాంకు మేనేజర్లు, న్యాయవాదులు, పోలీసులతో ఆయన సమావేశమయ్యారు. ఆయా కార్యక్రమాల్లో ప్రభుత్వ న్యాయవాది గంగుల శ్రీనివాసరావు, న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు వై రమేష్‌బాబు, కార్యదర్శి అనిల్‌కుమార్, ప్రిన్సిపాల్ హరిణి, అయ్యప్పరెడ్డి, సీనియర్ న్యాయవాదులు సీహెచ్ నాగిరెడ్డి, గంట్రకోట శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

17 నుంచి ఆధార్ ప్రత్యేక క్యాంపులు

మాచర్ల, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఈనెల 17 నుంచి 26వ తేదీ వరకు ఆధార్ ప్రత్యేక క్యాంపులు నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ ధూళిపాళ్ల వేణుబాబు తెలిపారు. జడ్పీ బాలురోన్నత, బాలికల పాఠశాలలు, క్లాక్ టవర్ సెంటర్‌లోని అప్పర్ ప్రైమరీ స్కూల్‌లో ఈ క్యాంపులు నిర్వహించనున్నట్లు చెప్పారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

నిమోనియా సోకకుండా శిశువులను కాపాడుకోవాలి

● వైద్యాధికారి డాక్టర్ సిరి చందన

క్రోసూరు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): ప్రాణాంతక నిమోనియా వ్యాధి సోకకుండా ఐదేళ్ల లోపు శిశువులందరినీ జాగ్రత్తగా కాపాడుకోవాలని క్రోసూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సిరిచందన అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిమోనియా నివారణకు ఇప్పటినుంచి 2026 ఫిబ్రవరి 28వరకు సాన్స్ పేరిట అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. దీనికి సంబంధించి కరపత్రాలను, బ్యానర్లను శుక్రవారం ఆరోగ్యకేంద్రంలో ప్రదర్శించారు. ఆరోగ్య విస్తరణ అధికారి శిఖాశ్యామ్‌సన్ మాట్లాడుతూ వ్యాధి నివారణకు శిశువులకు తల్లిపాలు తాగించాలని, సకాలంలో మొదటి, రెండో బూస్టర్ డోస్ వ్యాక్సిన్‌లు వేయించాలని చెప్పారు. కార్యక్రమంలో ఫార్మసిస్టుపాతిమా, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.


నిమోనియాపై అవగాహన బ్యానర్లు, కరపత్రాలు ప్రదర్శిస్తున్న వైద్య సిబ్బంది

గ్రామీణ ప్రాంతాల్లో సోలార్ ప్లేట్లు ఏర్పాటు చేయండి

● ట్రాన్స్‌కో ఎస్ఈ విజయకుమార్


మాచవరం విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మాట్లాడుతున్న పల్నాడు జిల్లా ఎస్ఈ పీ విజయకుమార్

మాచవరం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో సోలార్ పీఎం సూర్యఘర్ పథకానికి సంబంధించి గృహాల మీద సోలార్ ప్లేట్లు ఏర్పాటు చేసుకోవాలని జిల్లా ఎస్ఈ పీ విజయకుమార్ సూచించారు. శుక్రవారం మాచవరం విద్యుత్ సబ్‌స్టేషన్‌లో సిబ్బంది, ఇండియన్ బ్యాంక్ అధికారులతో ఏర్పాటుచేసిన సమావేశంలో ఎస్ఈ ముఖ్య అతిథిగా మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారులు ఇంటిపైన సోలార్ ప్లేట్లు అమర్చుకోవాలని, దీనికి మూడు కిలోవాట్ల ప్లేట్లు ఏర్పాటుచేసుకుంటే రూ.78వేల సబ్సిడీ కేంద్ర ప్రభుత్వం ఇస్తుందన్నారు. మిగిలిన ఖర్చు కింద బ్యాంక్‌రుణం అందజేస్తారన్నారు. 2026 మార్చి నాటికి పల్నాడు జిల్లాలో పదివేల సర్వీసులకు సోలార్ ప్లేట్లు ఏర్పాటుచేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో మాచర్ల ఈఈ సింగయ్య, దాచేపల్లి సబ్‌డివిజన్ డీఈఈ వీరేశ్వరరావు, ఎకౌంట్ అధికారి సందీప్‌కుమార్, ఏఈ భగవాన్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల నిరసన


కోర్టు ఆవరణలో నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

సత్తెనపల్లి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన న్యాయవాది భాను ప్రకాష్ పట్ల స్థానిక పోలీసుస్టేషన్‌లో పనిచేస్తున్న ఉదయ్‌చంద్ర దుర్భాషలాడి అవమానించటాన్ని నిరసిస్తూ శుక్రవారం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు విధులను బహిష్కరించి తమ నిరసన తెలిపారు. హెడ్ కానిస్టేబుల్ ఉదయ్‌చంద్రపై చర్యలు తీసుకోవాలని న్యాయవాదులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గుజ్జర్లపూడి మార్కురావు, చిన్నం మణి, జానీ ఖాజావలి, శ్రీనివాసరావు, పూదోట రాజు, దివ్వెల శ్రీనివాసరావు, మార్కురావు, మద్దినేని చలపతిరావు, కల్లం వీరభాస్కరరెడ్డి, కొల్లా వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

ద్విచక్రవాహనం దగ్ధం

రెంటచింతల, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): రెంటచింతలలోని ఓ సినిమా హాలు సమీపంలో ద్విచక్రవాహనం దగ్ధం అయ్యింది. హోంగార్డుగా పనిచేస్తున్న మరియదాసుకు చెందిన యూనికార్న్ ద్విచక్రవాహనాన్ని గృహానికి సమీపంలో ఉంచగా శుక్రవారం వేకువ జామున పూర్తిగా కాలిపోయింది. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నాగార్జున చెప్పారు.

18 నుంచి సత్యసాయి జయంతి వేడుకలు

కారంపూడి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక సత్యసాయి షిర్డీ సాయి దేవాలయంలో ఈనెల 18 నుంచి 23వ తేదీ వరకు సత్యసాయి శత జయంతి వేడుకలను నిర్వహించనున్నట్లు సత్యసాయి సేవా సదన్ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా వారు శుక్రవారం ఉత్సవాల్లో భాగంగా పేదలకు సేవా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సేవా సదన్ అధ్యక్షుడు తుమ్మేపల్లి నాగేశ్వరరావు, వెచ్చా వరలక్ష్మణరావు, కొల్లిపర వెంకట సుబ్బారావు, అమరయ్య, ఎస్‌పీఆర్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

క్రోసూరు ఎన్‌జీవోస్ యూనిట్ అధ్యక్షుడిగా జానీబాషా

బెల్లంకొండ, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఎన్‌జీవోఎస్ అసోసియేషన్ క్రోసూరు యూనిట్ అధ్యక్షుడిగా చంద్రాజుపాలెం పీహెచ్‌సీ సూపర్‌వైజర్‌గా జానీబాషాను ఎన్నుకున్నారు. కార్యదర్శిగా మహేష్‌బాబును ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఉమ్మడి గుంటూరు జిల్లా ఎన్‌జీవోస్ అసోసియేషన్ అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాసరావు, కార్యదర్శి శ్యామ్‌సుందర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు నాగుల్ షరీఫ్, అడహక్ చైర్మన్ రామకృష్ణ, సత్తెనపల్లి తాలూకా అధ్యక్షులు మణిరావు తదితరులు పాల్గొన్నారు. ఎన్నికల అధికారిగా బీ వెంకటేశ్వర్లు, ఎస్ అంబేద్కర్ వ్యవహరించారు.

ఎమ్మెల్యే ప్రవీణ్‌ను కలసిన డాక్టర్ చినరాజు


ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్‌ను కలసిన సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల అభివృద్ధి బోర్డు డైరెక్టర్ డాక్టర్ చినరాజు

పెదకూరపాడు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల అభివృద్ధి బోర్డు డైరెక్టర్‌గా ఇటీవల కూటమి ప్రభుత్వం ప్రకటించిన డాక్టర్ గుడిపూడి చిన రాజు ఎమ్మెల్యే ప్రవీణ్‌ను శుక్రవారం మర్యాదపూర్వకంగా కలసి కృతజ్ఞతలు తెలిపారు. గుంటూరులోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఆయనను కలిశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు ఏటుకూరి బ్రహ్మయ్య, అర్తిమళ్ళ రమేష్, సర్పంచ్ గుడిపూడి రాజు, మండల నేతలు బెల్లంకొండ రామగోపాలరావు, గల్లా బాబూరావు, పాశం ఆంజనేయులు, అంద్ర ప్రసాదు, పరుచూరి పూర్ణచంద్రరరావు, షేక్ ముంతాజ్, వడ్లమూడి అప్పారావు, షేక్ అజ్ముల్లా, నందిగమ రమేష్ తదితరులు ఉన్నారు.

నేటి బాలలే రేపటి పౌరులు

● ఘనంగా బాలల దినోత్సవం


సత్తెనపల్లి: కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నేతలు

మాచర్ల రూరల్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): నేటి బాలలే రేపటి పౌరులని మున్సిపల్ చైర్మన్ షేక్ మదార్‌సాహెబ్ అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా శుక్రవారం పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో ఆయన వారోత్సవాలను ప్రారంభించి మాట్లాడారు. గ్రంథాలయాలు విద్యార్థుల భవిష్యత్తుకు సోపానాలు అన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ ఇన్‌చార్జి మాచర్ల మెర్సీ, ఎంఈవో అల్లి సురేష్, గాదె కిరీటిరెడ్డి, మాచర్ల సుందరరావు, మాచర్ల వాసు, ఆయేషా, సుల్తాన్ బేగం, ఓరుగంటి చెన్నకేశవరావు తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం.. సామాజిక అవగాహన

క్రోసూరు: పుస్తక పఠనంతో విజ్ఞానం.. సామాజిక అవగాహన పెరుగుతుందని రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ డైరెక్టర్ ఏపూరి నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం క్రోసూరు శాఖా గ్రంథాలయంలో వారోత్సవాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు బండారు మైసూర్‌బాబు సమావేశానికి అధ్యక్షత వహించారు. ముందుగా మహాత్మాగాంధీ, నెహ్రూ చిత్రపటాలకు పూలదండలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి వై వీరాంజమ్మ, అభివృద్ధి కమిటీ ఉపాధ్యక్షుడు సుభానీ, కార్యదర్శి రాజేశ్వరరావు, గ్రంథాలయ స్థల దాత సాంబశివరావు పాల్గొన్నారు.


మాచర్ల: మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ మదార్‌సాహెబ్

● పిడుగురాళ్ల: పాఠశాలల్లో బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. స్థానిక స్కాలర్స్ స్కూల్, వికాస్, వివేకానంద, చైతన్య బాలకుటీర్, విద్యార్థి గ్లోబల్, వాసవి ఇంగ్లీషు మీడియం స్కూల్, గౌతమ్ మోడల్ స్కూల్, రామచంద్రాజి స్కూల్, విజయశ్రీ పబ్లిక్‌స్కూల్, భానోదయ స్కూల్, బోధి పాఠశాల, మాంటిస్సోరి ఇంగ్లీషు మీడియం స్కూల్, కామినేని స్కూల్, శస్త్రస్కూల్, వెంకటేష్ పబ్లిక్ స్కూల్, విజ్ఞాన్, నారాయణ ఇంగ్లీషు మీడియం స్కూల్ తదితర పాఠశాలల్లో నెహ్రూ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించి విద్యార్థులకు ఆటల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాలలో పాఠశాలల డైరెక్టర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. పిడుగురాళ్ల గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో శ్రీనివాసకాలనీలోని పార్క్‌స్కూల్‌లో విద్యార్థులకు బాలల దినోత్సవ ప్రాముఖ్యతను గ్రంథాలయాధికారి కె.రాజశేఖర్ వివరించారు.

● మాచవరం: మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో, గ్రంథాలయాల్లో బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మోర్జంపాడు హైస్కూల్‌లో విద్యార్థులకు ఆటలపోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమాల్లో గ్రంథాలయ అధికారులు సుజాత, విజయిబాయి, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● సత్తెనపల్లి: కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు దాసరి జ్ఞానరాజ్‌పాల్ ఆధ్వర్యంలో మాజీ ప్రధాని నెహ్రూ జయంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు చాంద్‌బాషా, మాదంశెట్టి వేద్రాది, మోహనరావు, కొత్త లక్ష్మయ్య, శేఖర్ తదితరులు పాల్గొన్నారు. పట్టణ, మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో బాలల దినోత్సవాన్ని నిర్వహించారు.

● ముప్పాళ్ళ: మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో శుక్రవారం బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. నార్నెపాడు జీఎంఆర్ మెమోరియల్ పాఠశాల విద్యార్థులు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.

● సత్తెనపల్లి: గ్రంథాలయాలను ఆదరించాలని మునిసిపల్ కమిషనర్ ఎం ఆనంద్‌కుమార్ అన్నారు. పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో వారోత్సవాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంఈవోలు శ్రీనివాసరావు, రాఘవేంద్రరావు, ఇన్‌చార్జ్ గ్రంథాలయ అధికారి రమేష్ పాల్గొన్నారు. స్థానిక కస్తూర్బా పాఠశాలలో ఫెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ ప్రసన్నరాణి, జక్కుల లక్ష్మీనారాయణ, ప్రసాదు, పోతులూరయ్య పాల్గొన్నారు.

● నకరికల్లు: నకరికల్లు శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాలను జెడ్పీహైస్కూల్ హెచ్ఎం జాలాది శ్రీనివాసరావు ప్రారంభించారు. గ్రంథాలయాధికారి పి.నారాయణరెడ్డి పాల్గొన్నారు. చల్లగుండ్ల జెడ్పీ హైస్కూల్‌లో బాలల హక్కుల గురించి వివరించారు. కార్యక్రమంలో డీబీఆర్‌సీ ఏరియా కో-ఆర్డినేటర్ ఈ కోటిరత్నం, హెచ్ఎం కంజుల రంగాదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● క్రోసూరు: మండలంలోని బాలెమర్రు ఎంపీయూపీ పాఠశాలలో హెచ్ఎం టీ శరత్‌కుమార్ విద్యార్థినులకు సుకన్య సమృద్ధి యోజన ఖాతాలను ప్రారంభింపజేశారు. కార్యక్రమంలో ముసునూరి పుల్లారావు తదితరులు పాల్గొన్నారు. బాలల దినోత్సవం మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు.

● అమరావతి: స్థానిక శాఖా గ్రంథాలయంలో వారోత్సవాలు ప్రారంభమైనాయి. నెహ్రూ జయంతి వేడుకలతో పాటు గ్రంథాలయ వ్యవస్థాపకులు వెంకటరమణయ్య చిత్రపటాలకు నివాళులర్పించారు. విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి వెంకాయమ్మ, చేకూరి జాజిబాబు, టీ ప్రదీప్ పాల్గొన్నారు.

● బెల్లంకొండ: నేటి బాలలే రేపటి పౌరులని ఎంఈవో రాజకుమారి అన్నారు. బెల్లంకొండ శాఖా గ్రంథాలయంలో బాలల దినోత్సవ వేడుకల్లో ఎంఈవో పాల్గొన్నారు. కార్యక్రమానికి గ్రంథాలయ అధికారి విజయబాయి అధ్యక్షత వహించారు. వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

● విజయపురిసౌత్: మాచర్ల మండలం సుబ్బారెడ్డిపాలెం, హస్నాబాద్‌తండాలలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు శుక్రవారం బిగ్‌హెల్ప్ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తాటి భాస్కర్‌బాబు బహుమతులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎంలు తాటి శరత్ చంద్, దివ్య, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

● దుర్గి: దుర్గి గ్రంథాలయంలో నిర్వహించిన జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో ఎంపీడీవో సుగుణ మాట్లాడారు. కార్యక్రమంలో ఎంఈవో బెంజిమెన్, గ్రంథాలయ అధికారి పులిబండ్ల వేణుగోపి, అబ్బాస్, లక్ష్మీనారాయణ, సర్వేశ్వరరావు, ఆంధ్రయ్య తదితరులు పాల్గొన్నారు.

● రెంటచింతల: బాలల దినోత్సవాన్ని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో నిర్వహించారు. ఆటల పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఎంఈవో 2 శివ నాగేశ్వరరావు, ఎన్.శ్రీనివాసరావు, ఆయా పాఠశాలల ప్రిన్సిపాళ్ళ, మంచికల్లు సొసైటీ చైర్మన్ యరపతినేని మట్టయ్య, సిలార్ అహ్మద్ పాల్గొన్నారు. రెంటచింతల శాఖాగ్రంథాలయంలో వాటి ప్రాధాన్యతను విద్యావేత్త ఎన్.శ్రీనివాసరావు వివరించారు. గ్రంథాలయాధికారి రాయపాటి రాజ కిషోర్, విద్యార్థులు పాల్గొన్నారు.


క్రోసూరు: మాట్లాడుతున్న రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ డైరెక్టర్ ఈపూరి నాగేశ్వరరావు


ప్రదర్శనకు హాజరైన రైల్వే అధికారులు

విపత్తుల వేళ ప్రాణరక్షణపై అవగాహన అవసరం

● రైల్వే ఏడీఆర్‌ఎం ఎడ్విన్

తెనాలి క్రైం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): అనుకోని విపత్తుల నుంచి బయటపడి ప్రాణాలు కాపాడుకోవడంలో ప్రతి ఒక్కరికీ కొంతైనా అవగాహన అవసరమని దక్షిణ మధ్య రైల్వే విజయవాడ ఏడీఆర్‌ఎం పీఈ ఎడ్విన్ పేర్కొన్నారు. శుక్రవారం తెనాలి రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులకు, విద్యార్థులకు అనుకోని ప్రమాద నుంచి రక్షణ పొందే విధానాలపై మాక్ డ్రిల్ నిర్వహించారు. దక్షిణ మధ్య రైల్వే విజయవాడ సివిల్ డిఫెన్స్ ఆర్గనైజేషన్ సిబ్బంది ప్రదర్శించిన ఈ కార్యక్రమానికి ఏడీఆర్‌ఎం ఎడ్విన్, డీఎఎం పీవీ రామిరెడ్డి, డీవోఎంజీ ఎం.దినేష్ కుమార్, సికింద్రాబాద్ రైల్వే నిలయం టి.సుధీర్‌బాబు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన మాక్ డ్రిల్‌లో బ్లాంబు బ్లాస్ట్, అగ్ని ప్రమాదాలు, ప్రాథమిక చికిత్స విధానాలు, గ్యాస్ లీక్ ప్రమాదాలు, రైలులో అప్రమత్తత వంటి వాటిపై అవగాహన ప్రదర్శనలు నిర్వహించారు. స్టేషన్ సూపరింటెండెంట్ పీవీ రమణ, స్థానిక రైల్వే అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



ప్రమాద సమయంలో రక్షణపై డెమో


బాంబు బ్లాస్ట్ డెమో


చేజర్ల కపోతేశ్వరస్వామి ఆలయ ప్రదక్షిణ చేస్తున్న దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ ఆపరేషన్స్ మేనేజరు కె. పద్మజ

కపోతేశ్వరస్వామి దర్శనం మహా పుణ్యఫలం

● దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ ఆపరేషన్స్ మేనేజరు కె.పద్మజ

నకరికల్లు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): దక్షిణ కాశీగా ప్రసిద్ధి పొందిన ప్రముఖ శైవక్షేత్రం చేజర్ల కపోతేశ్వరస్వామిని దర్శించుకోవడం మహా పుణ్యఫలంగా భావిస్తున్నానని దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ ఆపరేషన్స్ మేనేజర్ కె.పద్మజ పేర్కొన్నారు. శుక్రవారం ఆమె మండలంలోని చేజర్ల గ్రామంలో ఉన్న గంగా భ్రమరాంబ పార్వతీ సమేత కపోతేశ్వరస్వామి దేవాలయాన్ని సందర్శించారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకస్వామి కొండకావూరి వెంకట్రామయ్యాశర్మ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఆమెను ఘనంగా సత్కరించారు. దేవాలయ ప్రాశస్త్యాన్ని, విశిష్టతను వివరించారు. కపోతేశ్వర ఆలయన సందర్శనకు దేశం నలుమూలల నుంచి భక్తులు వస్తుంటారని.. చేజర్లకు ఐదు కిలోమీటర్ల దూరంలోని కుంకలగుంట లో రైల్వే స్టేషన్‌లో రైళ్ల ఆగే విధంగా తగు చర్యలు తీసుకోవాలని యాత్రికులు ప్రిన్సిపల్ చీఫ్ ఆపరేషన్స్ మేనేజర్ కె.పద్మజను కోరారు. ఈ విషయమై సానుకూలంగా స్పందించిన పద్మజ తగు చర్యలు తీసుకుంటానని సమాధానం ఇచ్చారు. ఆలయ అధికారి చుండు గోవర్ధనరావు తదితరులు ఉన్నారు.


సమావేశంలో ప్రసంగిస్తున్న రామ్‌కుమార్‌మీనన్ తదితరులు

సుగంధ ద్రవ్యాల రంగంలో
మరింత వృద్ధి సాధించాలి

● డబ్ల్యూఎస్‌వో చైర్మన్ రామ్‌కుమార్ మీనన్

గుంటూరు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): దేశంలో సుగంధ ద్రవ్యాల రంగంలో మరింత వృద్ధి సాధించేందుకు ప్రణాళికతో ముందుకు సాగాలని వరల్డ్ స్పైసెస్ ఆర్గనైజేషన్ (డబ్ల్యూఎస్‌వో) చైర్మన్ రామ్‌కుమార్ మీనన్ సూచించారు. జాతీయ సుగంధ ద్రవ్యాల 4వ సదస్సు గుంటూరు రింగ్ రోడ్డులో శుక్రవారం ప్రారంభమైంది. రెండు రోజుల పాటు జరిగే జాతీయ సదస్సుకు పలువురు పారిశ్రామికవేత్తలు హాజరయ్యారు. ఈ సందర్భంగా చైర్మన్ మీనన్ మాట్లాడుతూ దేశంలో ఆహార భద్రతను బలోపేతం చేయడం, సుగంధ ద్రవ్యాల రంగంలో వృద్ధిని పెంచడం సమావేశం ప్రధాన లక్ష్యాలను వివరించారు. ప్రపంచ వ్యాప్తంగా సుగంధ ద్రవ్యాలకు డిమాండ్ గణనీయంగా పెరుగుతున్న కీలకమైన సందర్భంలో పరిశ్రమ ఉందంటూ వ్యాపార స్థిరత్వాన్ని చాటుకోవాలని సూచించారు. సైంటిఫిక్ ప్యానెల్ ఆన్ పెస్టిసైడ్ రెసిడ్యూస్ చైర్మన్ డాక్టర్ పరేష్ షా మాట్లాడుతూ సుగంధ ద్రవ్యాల సరఫరా విధానం అమలు.. వృద్ధికి పునాది అని తెలిపారు. సుగంధ ద్రవ్యాల బోర్డు డైరెక్టర్ డాక్టర్ ఏబీ రమాశ్రీ రైతుల జీవనోపాధిని మార్చడంలో సాంకేతికత వ్యాప్తి పాత్రను వివరించారు. సాంకేతికతను పొలాల్లోకి తీసుకురావడం, విభిన్న ప్రాంతాలలో దానిని వ్యాప్తి చేయడం, రైతులు సృష్టించిన విలువలో వాటాను నిర్ధారించడం ఒక సవాలుగా మారిందన్నారు. రైతుల సంక్షేమం, అభివృద్ధికి అందరూ కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో పలువురు వ్యాపారవేత్తలు పాల్గొన్నారు.

భద్రతా ప్రమాణాలను మెరుగుపరచాలి

● ఢిల్లీ పేలుళ్ల దృష్ట్యా మరింత పటిష్టపరచాలి
● రుణ సంస్థల రికవరీ ఏజెంట్లపై ప్రత్యేక దృష్టి
● నేర సమీక్ష సమావేశంలో ఎస్పీ వకుల్ జిందాల్

గుంటూరు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై ఉక్కుపాదం మోపాలని ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశించారు. ఢిల్లీ పేలుళ్ల దృష్ట్యా ప్రాముఖ్యతను బట్టి భద్రతా ప్రమాణాలను మెరుగుపరచాలన్నారు. ఈ మేరకు జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన నేర సమీక్ష సమావేశంలో పలు అంశాలపై ఆయన కీలక ఆదేశాలు జారీ చేశారు. ఢిల్లీలో బాంబు పేలుళ్ల ఘటనను దృష్టిలో పెట్టుకొని జిల్లాలో భద్రతా చర్యలను కట్టుదిట్టం చేయాలన్నారు. సీఎం, మాజీ సీఎం నివాసాలు, హైకోర్టు, సచివాలయం మొదలగు సున్నితమైన ప్రాంతాల్లో జిల్లా భద్రతా విభాగం క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించాలని సూచించారు. అత్యంత భద్రత కలిగిన ఈ ప్రదేశాల్లో ప్రతి రెండు నెలలకోసారి.. భద్రత పరమైన తనిఖీలు క్షుణ్ణంగా చేపట్టి, సమగ్ర నివేదిక సమర్పించాలన్నారు. వీవీఐపీ, వీఐపీలు వెళ్లే మార్గాల్లో సీసీ కెమెరాలు సక్రమంగా పనిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఎస్పీ ఆదేశించారు. స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ప్రతి గ్రామం, మండలం పూర్తి సమాచారాన్ని సేకరించాలని సూచించారు. రౌడీ షీటర్లు, సస్పెక్ట్, హిస్టరీ షీట్లు, ఎన్నికల సమయంలో కేసులున్న ఉన్నవారిని బైండ్ ఓవర్ చేయాలని ఆదేశించారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో కీలకమైన 10 మంది నేరస్తులను గుర్తించి, వారు తిరిగి నేరాలకు పాల్పడితే పీడీ చట్టం ప్రయోగించాలని, బెయిల్‌ని కూడా రద్దు చేయించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. పోలీసు సిబ్బంది మంచి ప్రవర్తన కలిగి ఉండేలా చూడాల్సిన బాధ్యత సదరు పోలీస్‌స్టేషన్ అధికారిపై ఉందన్నారు. పోలీస్ స్టేషన్ రిసెప్షన్ కౌంటర్‌లో మంచి నడవడిక, ప్రవర్తన కలిగిన పోలీస్ సిబ్బందిని నియమించాలన్నారు.


నేర సమీక్ష సమావేశంలో అధికారులతో మాట్లాడుతున్న ఎస్పీ వకుల్ జిందాల్

రికవరీ ఏజంట్లపై చర్యలు

ఇటీవల కాలంలో రుణ సంస్థల రికవరీ ఏజెంట్లు ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు చాలా ఫిర్యాదులు అందుతున్నాయని ఎస్పీ ఈ సందర్భంగా తెలిపారు. అటువంటి రికవరీ ఏజెంట్లకు సరైన కౌన్సెలింగ్ ఇచ్చి.. బైండ్ ఓవర్ చేయాలన్నారు. ఆ సంస్థల యజమానులు న్యాయ పరంగా వెళ్లే విధంగా అవగాహన కల్పించాలన్నారు. డయల్ 112 కాల్స్ పట్ల ప్రత్యేక దృష్టి సారించి.. పట్టణ ప్రాంతాల్లో 10 నిమిషాలు, గ్రామీణ ప్రాంతాల్లో 20 నిమిషాలు సదరు ఫోన్ కాల్‌కి హాజరై ఎటువంటి సమస్యలు లేకుండా చూడాలన్నారు. ప్రతి పోలీస్ సబ్ డివిజన్‌కి ఒక క్రైమ్ స్పాట్ వాహనాన్ని ఇచ్చామన్న ఎస్పీ.. నేరం జరిగినప్పుడు.. క్రైమ్ ప్రదేశంలో ఉన్న సాక్ష్యాధారాలను వాహనంలో ఉన్న ఆధునిక పరికరాలను ఉపయోగించి సమగ్రంగా సేకరించాలన్నారు. ఇలా పలు అంశాలపై ఎస్పీ వకుల్‌జిందాల్ క్షుణ్ణంగా చర్చించారు. ఈ సమీక్షలో జిల్లా అదనపు ఎస్పీలు రమణమూర్తి, (అడ్మిన్) ఏటీఎస్ రవికుమార్, హనుమంతు (ఏఆర్), డీఎస్పీలు, సీఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.


ప్రకాశం బ్యారేజి దిగువకు విడుదల అవుతున్న కృష్ణానది వరదనీరు

ప్రకాశం బ్యారేజి వద్ద స్వల్పంగా వరద ఉధృతి

తాడేపల్లి టౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాజెక్టుల నుంచి నీటిని విడుదల తగ్గించడంతో ప్రకాశం బ్యారేజి వద్ద కృష్ణానది వరద ఉధృతి స్వల్పంగా కొనసాగుతోంది. ఎగువన పులిచింతల ప్రాజెక్టు, ప్రధాన వాగుల నుంచి 14,502 క్యూసెక్కుల వరద నీరు శుక్రవారం ఇన్‌ఫ్లోగా నమోదు అవుతుండగా.. 3,625 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు ఇరిగేషన్ జేఈ రాజేష్ తెలిపారు. బ్యారేజి రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటి మట్టం కొనసాగుతుండగా తూర్పు డెల్టా కాలువకు 5,017, పశ్చిమ డెల్టాకు 5,634, గుంటూరు ఛానల్‌కు 226 క్యూసెక్కుల నీటిని వదులుతున్నట్టు జేఈ తెలిపారు.

సాగర్‌లో 305.50 టీఎంసీలు

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయం నీటిమట్టం శుక్రవారం నాటికి 587.00 అడుగులు ఉంది. ఇది 305.50 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 10వేలు, ఎడమ కాలువ ద్వారా 4,034, ఎస్‌ఎల్‌బీసీ ద్వారా 600, ఎల్‌ఎల్‌సి ద్వారా 300, మొత్తం ఔట్‌ఫ్లో 14,934 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు 14,934 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

1.0682 ఎంయూల విద్యుదుత్పత్తి

రెంటచింతల: సత్రశాలలోని నాగార్జునసాగర్ టెయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టులో గురువారం అర్ధరాత్రి 12 గంటల వరకు 1.0682 ఎంయూల విద్యుదుత్పత్తి జరిగినట్లు ఎస్‌ఈ కె.వెంకటరమణ చెప్పారు. ఎగువన సాగర్ నుంచి నీళ్లు రాకపోవడం వల్ల 20 రేడియల్ క్రస్ట్ గేట్లన్నీ మూసివేశామన్నారు. రిజర్వాయర్‌లో 74.13 మీటర్ల మేర నీరుండగా.. ఇది 6.1660 టీఎంసీలకు సమానమన్నారు.

సీఆర్డీఏ పరిధిలోని
అక్రమ లేఅవుట్ల ధ్వంసం


సీఆర్డీఏ పరిధిలోని అనధికార లేఅవుట్‌ను ధ్వంసం చేయిస్తున్న అధికారులు

తుళ్లూరు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): సీఆర్డీఏ పరిధిలోని అక్రమ లేఅవుట్ల ధ్వంసం పక్రియ కొనసాగుతోంది. శుక్రవారం గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం నారాకోడూరులోని సర్వే నంబరు 469(పీ)లోని ఎకరం రెండు సెంట్లు, వడ్లమూడిలోని సర్వే నంబరు 307(పీ)లోని ఎకరం 60 సెంట్లు, పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం గండ్లూరులోని ఎల్‌పీఎం నంబరు 3092. సర్వే నంబరు 198/ఏ5 ఎకరం 75 సెంట్లు, భీమవరం గ్రామంలోని సర్వే నంబరు 286/3లో ఎకరం 2.82 సెంట్లు, కృష్ణాజిల్లా గన్నవరం మండలం సూరంపల్లిలోని సర్వే నంబరు 442లోని 6 ఎకరాలలోని అనధికార లేఅవుట్లను సీఆర్డీఏ అధికారులు ధ్వంసం చేయించారు. సీఆర్డీఏ పరిధిలోని అనధికార లేఅవుట్లను ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించబోమని రాజధాని అమరావతిలోని సీఆర్డీఏ కార్యాలయం ఒక ప్రకటనలో హెచ్చరించింది.

వినియోగదారుల సంతృప్తి స్థాయిని పెంచాలి

● పీఎం సూర్య ఘర్ పథకంపై అవగాహన కల్పించాలి
● ఏపీ సీపీడీసీఎల్ సీఎండీ పుల్లారెడ్డి

గుంటూరు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారుల సంతృప్తి స్థాయిని పెంచేలా అధికారులు, సిబ్బంది సమష్టిగా కృషి చేయాలని ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపీ సీపీడీసీఎల్) సీఎండీ పీ పుల్లారెడ్డి సూచించారు. పొన్నూరు రోడ్డులోని విద్యుత్ భవన్‌లో సంస్థ డైరెక్టర్లు ఆవుల మురళీకృష్ణ యాదవ్ (టెక్నికల్), టీవీఎస్‌ఎన్ మూర్తి (ప్రాజెక్ట్స్), ఎస్.వెంకటేశ్వర్లు(ఫైనాన్స్)తో కలిసి గుంటూరు సర్కిల్ సమీక్ష సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎండీ సర్కిల్ పరిధిలోని గుంటూరు టౌన్-1, తెనాలి డివిజన్‌ల వారీగా వివరాలు అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా ఇంటిపై సోలార్ ప్యానల్స్ ఏర్పాటులో ప్రభుత్వ రాయితీ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. పీఎం సూర్యఘర్ పథకంపై అవగాహన కల్పించాలని కోరారు. విద్యుత్ అంతరాయాలను పూర్తిగా నియంత్రించాలని, ట్రాన్స్‌ఫార్మర్స్ నిర్వహణలో నిర్లక్ష్యం వద్దన్నారు. అలానే విద్యుత్ ప్రమాదాలు జరగకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వ పథకమైన ఆర్‌డీఎస్‌ఎస్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను, కాంట్రాక్టర్లను ఆదేశించారు. మరో వైపు స్మార్ట్ మీటర్ల ఏర్పాటును పూర్తి స్థాయిలో చేయాలని, ప్రజలకు అవగాహన కల్పించి నచ్చచెప్పాలన్నారు. అలానే సర్కిల్ స్థాయిలో బకాయిలను పూర్తి స్థాయిలో వసూలు చేయాలని, ఇందులో నిర్లక్ష్యం చేయవద్దన్నారు. సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. సమావేశంలో గుంటూరు సర్కిల్ ఆపరేషన్ ఎస్‌ఈ చల్లా రమేష్, ఎస్‌ఏవో పాశం రామిరెడ్డి, ఆపరేషన్ ఈఈలు టి.శ్రీనివాసబాబు (గుంటూరు-1) సత్యనారాయణ (తెనాలి), పలువురు డీఈఈలు, ఏఈలు ఉన్నారు.


సమీక్షలో మాట్లాడుతున్న సీఎండీ పుల్లారెడ్డి, డైరెక్టర్స్ మురళీకృష్ణ, మూర్తి, వెంకటేశ్వర్లు



సోలారిష్టాలు

● 'సూర్యఘర్' యోజనకు బాలారిష్టాలు
● సిబిల్ స్కోర్‌తో ఆదిలోనే ఆటంకం
● పల్నాడులో 10 సోలార్ సెట్ల ఏర్పాటే లక్ష్యం..
● బ్యాంకర్లు సహకరించాలని కోరుతున్న విదుత్ శాఖ

నరసరావుపేట రూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రధాన మంత్రి సూర్యఘర్ బిజిలి యోజన లక్ష్యానికి ఆదిలోనే ఆటంకం ఏర్పడుతోంది. సౌర ఫలకాల ఏర్పాటులో విద్యుత్‌శాఖ బాలారిష్టాలను ఎదుర్కొంటోంది. పల్నాడు జిల్లాలో 10 వేల సోలార్ సెట్ల ఏర్పాటే లక్ష్యంగా విద్యుత్ అధికారులు కృషి చేస్తున్నారు. కానీ, సోలార్ విద్యుత్ ఏర్పాటు చేసుకుందా మని ముందుకొచ్చిన.. లబ్ధిదారుల్లో 80 శాతం మందికి సిబిల్ స్కోరు లేదంటూ బ్యాంకర్లు వెనకడుగు వేస్తున్నారు. మరికొంత మంది తమ ఇంటికి పూర్వీకుల పేరుతో ఇంటి పన్ను ఇప్పటికీ కడుతున్నారు. ప్రస్తుతం లబ్ధిదారుల పేరుమీద ఇంటి పేపర్లు ఉండాలన్న నిబంధన వారికి ప్రతిబంధకంగా మారుతోంది. 3 కిలోవాట్ సోలార్ సెట్ రూ.2,10,000 కాగా, కేంద్ర ప్రభుత్వం రూ.78వేలు రాయితీ అందిస్తోంది. మిగిలిన దానిలో లబ్ధిదారుని వాటా 10శాతం రూ.21వేలు చెల్లించాల్సి ఉంది. మిగిలిన రూ.1,32,000లను ఆయా గ్రామాల పరిధిలోని బ్యాంకు ద్వారా రుణం పొందాల్సి ఉంటుంది. సిబిల్ స్కోరు తక్కువగా ఉందని ఆయా బ్యాంకులు రుణాలను తిరస్కరించడంతో కేంద్ర ప్రభుత్వ లక్ష్యం నీరుగారిపోతోంది. సిబిల్ స్కోరుతో సంబంధం లేకుండా బ్యాంకులు రుణాలు మంజూరు చేయగలిగితే లబ్ధిదారులు మరింత ముందుకు వచ్చి సోలార్ సెట్లు ఏర్పాటు చేసుకుంటారు. ఈ నేపథ్యంలో జిల్లా స్థాయి ఉన్నతాధికారులు బ్యాంకర్లతో సమావేశం నిర్వహించి.. సోలార్ సెట్ల ఏర్పాటుకు రుణాలు మంజూరు చేయించాలని గ్రామీణ ప్రజలు కోరుతున్నారు.

సమష్టి బాధ్యతతోనే మానవ హక్కుల రక్షణ

● నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిటీ స్టేట్ చైర్మన్ డాక్టర్ శ్యామల జయ కోటిరెడ్డి


ప్రమాణ స్వీకార కార్యక్రమంలో నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిటీ సభ్యులు

గుంటూరు(తూర్పు), నవంబరు 14(ఆంధ్రజ్యోతి): మానవ హక్కుల పరిరక్షణ సమష్టి బాధ్యతగా ప్రతి ఒక్కరూ గుర్తించాలని నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిటీ స్టేట్ చైర్మన్ డాక్టర్ శ్యామల జయ కోటిరెడ్డి అన్నారు. స్థానిక కొరిటెపాడు, హ్యూమన్ రైట్స్ కమిటీ కార్యాలయంలో శుక్రవారం గుంటూరు, పల్నాడు జిల్లాల కార్యవర్గ ప్రమాణ స్వీకారం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ మానవ హక్కుల ఉల్లంఘనలపై ఉపేక్షించవద్దని సూచించారు. బాధితులకు అండగా నిలబడి, న్యాయం జరిగే వరకు పోరాటం చేయాలన్నారు. ముఖ్య అతిథులు.. పారిశ్రామిక వేత్త ఉడుముల వెంకటేశ్వరరెడ్డి, రెడ్డి వసతి గృహ కార్యదర్శి కె.వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ మానవ హక్కులపై గ్రామీణ ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం గుంటూరు జిల్లా అధ్యక్షుడు ఎం.వివేకానంద రెడ్డి ఆధ్వర్యంలో నూతన కమిటీ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు.

అసాంఘిక కార్యకలాపాలపై టాస్క్ ఫోర్స్ బృందం దాడులు


పట్టుబడిన నిందితులతో జీఆర్పీ పోలీస్ అధికారులు, సిబ్బంది

గుంటూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక టాస్క్ ఫోర్స్ బృందం శుక్రవారం దాడులు నిర్వహించింది. ఫిరంగిపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని తక్కెళ్లపాడు శివారులోని చెరువు వద్ద ఒక ఇంటిలో పేకాట ఆడుతున్న తొమ్మిది మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 9 సెల్ ఫోన్లు, 4 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. రూ.6,620 నగదు, రూ. 1,14,500 విలువైన కాయిన్‌లను సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అదే విధంగా మంగళగిరి రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నవులూరు గ్రామంలోని ఒక ఇంటిని అద్దెకు తీసుకుని ఆర్గనైజింగ్ వ్యభిచారం నిర్వహిస్తున్నారనే సమాచారంతో.. ఆకస్మిక దాడి నిర్వహించారు. ముగ్గురు మహిళలు, ఇద్దరు పురుషులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి ఆరు సెల్ ఫోన్లను సీజ్ చేశారు. జిల్లాలో అసాంఘిక, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని ఎస్పీ వకుల్‌జిందాల్ ఈ సందర్భంగా హెచ్చరించారు.

ప్రయాణికులే లక్ష్యంగా చోరీలు

బంగారు ఆభరణాలు దొంగలించిన ఆరుగురు నిందితులను గుంటూరు జీఆర్పీ, ఆర్పీఎఫ్ సిబ్బంది.. గుంటూరు డీఎస్పీ పి.అక్కేశ్వర ఆధ్వర్యంలో చాకచక్యంగా పట్టుకున్నారు. ఈ మేరు శుక్రవారం వివరాలను వెల్లడించారు. ఆరుగురూ ఒక గుంపుగా ఒంటరిగా ప్రయాణించే మహిళలను లక్ష్యంగా చేసుకొని.. బ్యాగుల్లోని బంగారు నగలు దొంగతనం చేస్తూ ఉంటారు. నిందితులు ఎర్రసాని గోవిందరాజు, ఎర్రసాని దుర్గాప్రసాద్, పెదాల రాజు, గిరాక వరలక్ష్మి, మెడ నరసమ్మ, కొడటి అమృతను అరెస్ట్ చేశారు. చోరీకి గురైన 75 గ్రాముల బంగారం విలువ సుమారు రూ.6,22,000గా లెక్కగట్టారు. నిందితులు పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన తాడేపల్లిగూడెం నివాసులుగా తేలింది. నిందితులు బస్టాండ్, రైల్వేస్టేషన్లు, హాస్పిటల్స్ వద్ద ముఖ్యంగా ఈ రద్దీగా ఉండే ప్రాంతాల్లో ఒంటరి మహిళలను లక్ష్యంగా చేసుకొని దొంగతనాలకు పాల్పడుతుంటారు. నిందితులను పట్టుకున్న గుంటూరు జీఆర్పీ ఎస్‌ఐ దీపిక, ఆర్‌పీఎఫ్ ఎస్‌ఐ శీనివాస్‌రెడ్డి, ఎస్‌ఐ శ్రీనివాస్, సిబ్బంది డీఎస్పీ అభినందించారు.

గోకుల క్షేత్రంలో
నేటి నుంచి లక్ష దీపోత్సవం


లక్ష దీపోత్సవం గోడప్రతులను ఆవిష్కరిస్తున్న వంశీధర దాస

మంగళగిరి సిటీ, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కార్తి క మాసం సందర్భం గా తాడేపల్లి మండ లం కొలనుకొం డలోని హరే కృష్ణ గోకుల క్షేత్రంలో శనివారం నుంచి ఈ నెల 20వ తేదీ వరకు లక్ష దీపో త్సవం జరుగు తుందని గోకుల క్షేత్రం ప్రెసిడెంట్ వంశీధర దాస తెలిపారు. లక్ష దీపోత్సవానికి సంబంధించిన గోడప్రతులను శుక్రవారం మంగళగిరిలోని అక్షయపాత్ర కార్యాలయంలో ఆవిష్కరించారు. ప్రతిరోజు సాయంత్రం ఆరు గంటలకు అఖండదీపంతో ఉత్సవాలు ప్రారంభమ వుతాయన్నారు. అనంతరం శ్రీ రాధా గోకులానందుల పల్లకీ ఉత్సవం, ప్రవచనాలు, లక్ష దీపాల అలంకరణ, దామోదర హారతి, ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. కార్తిక మాసంలో నెయ్యి దీపం సమర్పించడం అత్యంత పుణ్యకార్యమని, భక్తులు ఆలయాన్ని సందర్శించి స్వామి వారి దర్శనం చేసుకుని, నెయ్యి దీపం సమర్పించాలని కోరారు. రాష్ట్ర ప్రజల శ్రేయస్సు, శాంతి, సమృద్ధి, సమాజంలో ఆధ్యాత్మికత పెంపొందిం చడమే లక్ష్యంగా లక్ష దీపోత్సవం జరుగుతుందన్నారు. కార్తిక లక్షదీప పూజలో పాల్గొన దలచినవారు 73992 25533 నంబరుకు సంప్ర దించాలని సూచించారు. వైస్‌ప్రెసిడెంట్ విలాస విగ్రహదాస, పీఆర్వో రఘునందన దాస పాల్గొన్నారు.

రాజధాని రైతుల గ్రీవెన్స్‌కు ఐదు అర్జీలు

తుళ్లూరు నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : రాజధాని అమరావతిలో రైతులు, రైతు కూలీల సమస్యల పరిష్కారం కోసం తుళ్లూరులోని సీఆర్డీఏ కార్యాలయంలో శుక్రవారం గ్రీవెన్స్ డే నిర్వహించారు. పలువురు రాజధాని ప్రాంతవాసులు, రైతు కూలీలు తమ అర్జీలను గ్రీవెన్స్ రిడ్రెస్సల్ మేనేజ్‌మెంట్(జీఆర్‌ఎం) నోడల్ అధికారి పి.జయశ్రీకి అందజేశారు. అర్జీలను పరిష్కరిస్తామని నోడల్ అధికారి వారికి హామీ ఇచ్చారు. వివిధ విభాగాల అధికారులు గ్రీవెన్స్ డేకు హాజరై అర్జీదారుల ఫిర్యాదులను పరిష్కరించారు. మిగిలినవి ఉన్న తాధికారులకు నివేదించి వెంటనే పరిష్కరిస్తామని చెప్పారు, సమస్యలు పరిష్కరించడంలో అలసత్వం వద్దని నోడల్ అధికారి సూచించారు. ప్రతి శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు జరిగే గ్రీవెన్స్ డేను రైతులు వినియోగించుకోవాలని ఆమె కోరారు. అమరావతిలో భూ వ్యవహారాలు - డెవలప్మెంట్ ప్రమోషన్ - 1 ఎల్పీఎస్ ఇన్‌ఫ్రా- 1. సామాజిక సంక్షేమ విభాగం(ఇంజినీరింగ్) ఒకటి మొత్తం ఐదు అర్జీలు వచ్చాయి. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు కె.ఎస్.భాగ్యరేఖ, జి.భీమారావు, ఎం.శేషిరెడ్డి, పి.పద్మావతి, బి.శ్రీనివాస్ నాయక్, వేస్టేట్స్ విభాగ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే రవీంద్ర ప్రసాద్, సామాజిక సంక్షేమ విభాగ డీసీడీఓ బొర్రా శ్రీనివాసరావు, డెవలప్‌మెంట్ ప్రమోషన్ విభాగ జోనల్ జాయింట్ డైరెక్టర్ సి.హెచ్. మధుసూదనరావు, తహసీల్దార్లు పాల్గొన్నారు.


గ్రీవెన్స్‌లో రైతుల అర్జీలను పరిశీలిస్తున్న నోడల్ అధికారి జయశ్రీ

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

రేపు భువనచంద్రలో పౌరాణిక నాటకాలు

నరసరావుపేట కల్చరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): భువనచంద్ర టౌన్‌హాల్ కమిటీ ఆధ్వర్యంలో నెలవారీ సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా ఆదివారం పౌరాణిక నాటకాలు ప్రదర్శిస్తున్నట్లు కమిటీ చైర్మన్ జవ్వాజి వెంకట్రావు శుక్రవారం తెలిపారు. పట్టణ కళాకారుల సమాఖ్య, శృతిలయ కళాసమితి వారు సంయుక్తంగా సమర్పిస్తున్నట్లు ఆయన చెప్పారు. కార్యక్రమంలో భాగంగా శ్రీకృష్ణ రాయబారము పడకసీను, చింతామణి భవాని సీను, హరిశ్చంద్ర అడివి సీను, హరిశ్చంద్ర వారణాసి సీను, రాయభారం సెంట్రల్ సీను, హరిశ్చంద్ర కాటీ సీను, బాలనాగమ్మ ఫకీరు సీను ప్రదర్శించనున్నట్లు తెలిపారు. సాయంత్ర 6 గంటలకు నాటకాలు ప్రారంభమవుతాయన్నారు.

నేడు ప్రభుత్వ శాఖల అధికారులతో జీవీ సమీక్ష

వినుకొండ టౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక మున్సిపల్ కార్యాలయంలో వివిధ శాఖల ప్రభుత్వ అధికారులతో చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు శనివారం సమీక్ష నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ సుభాష్ చంద్రబోస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి రెవెన్యూ, పోలీస్, పంచాయతీరాజ్, హౌసింగ్, విద్యుత్, ఆర్‌అండ్‌బీ, ఆర్‌డబ్ల్యూఎస్, అంగన్‌వాడీ, వైద్య, ఆరోగ్య తదితర శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని తెలిపారు.

స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమం

వినుకొండ టౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కమిషనర్ సుభాష్ చంద్రబోస్ ఆధ్వర్యంలో పట్టణ పరిధిలోని గుడ్ షెపర్డ్ స్కూల్‌లో స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర నవంబర్ నెల థీమ్ మన పరిశుభ్రత- మన ఆరోగ్యం గురించి అవగాహన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఇస్మాయిల్ వ్యక్తిగత పరిశుభ్రత, హ్యాండ్ వాష్, బహిరంగ మలమూత్ర విసర్జన నివారణ, సామాజిక పరిశుభ్రత గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సాయి హాస్పిటల్స్ డాక్టర్ సుంకర అనూష బ్రెస్ట్, సర్వైకల్ క్యాన్సర్ గురించి అవగాహన కల్పించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఇస్మాయిల్ విద్యార్థులతో స్వచ్ఛఆంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో గుడ్ షెపర్డ్ స్కూల్ ప్రిన్సిపాల్ సునీత, ఉపాధ్యాయులు, విద్యార్థులు శానిటరీ సెక్రటరీలు, మేస్త్రీలు పాల్గొన్నారు.

ముస్లింల సంక్షేమం చంద్రబాబు తోనే సాధ్యం: షేక్ జానీ

వినుకొండ, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ముస్లింల సంక్షేమం సీఎం చంద్రబాబు నాయుడుతోనే సాధ్యమని తెలుగు యువత రాష్ట్ర కార్య నిర్వహణ కార్యదర్శి, వినుకొండ నియోజకవర్గం ముస్లిం మైనారిటీ అధ్యక్షుడు షేక్ జానీ శుక్రవారం ఒక ప్రకటనలో అన్నారు. ఇమామ్, మౌజనులకు 12నెలల గౌరవ వేతనం విడుదల చేయటంపై జానీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా జానీ మాట్లాడుతూ భారతదేశంలో మొట్ట మొదటిసారి ఇమామ్ మౌజనులకు గౌరవ వేతనాలు ఇచ్చిన ఘనత మన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుదే అని కొనియాడారు. 90 కోట్ల రూపాయలు 5000 మసీదులకు కేటాయించడంపై ఇమామ్ మౌజన్లు ఎంతో సంతోషంగా ఉన్నారన్నారు. అలాగే వినుకొండ నియోజకవర్గంలో చీఫ్ జీవీ ఆంజనేయులు ఆధ్వర్యంలో మైనార్టీలకు శివశక్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పేద ముస్లిం విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లతో పాటుగా విదేశీ విద్య అందిస్తున్నారన్నారు. పట్టణంలోని ఈద్గా ప్రహరీ గోడ నిర్మాణానికి 40 లక్షలు కేటాయించడం హర్షణీయమన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

చిలకలూరిపేట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాలకు, పట్టణానికి చెందిన 30మందికి ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు శుక్రవారం రూ.16.90 లక్షల విలువైన సీఎం సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నెల్లూరి సదాశివరావు, పఠాన్ సమద్ ఖాన్, జె.మదన్ మోహన్ పాల్గొన్నారు.

క్లుప్తంగా...

● చిలకలూరిపేట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక మునిసిపల్ కౌన్సిల్ హాలులో శుక్రవారం మెప్మా ఆర్పీల కోసం ఘన వ్యర్థ నిర్వహణపై సామర్థ్య వృద్ధి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, కమిషనర్ పి.శ్రీహరి బాబు పాల్గొన్నారు.

● నరసరావుపేట టౌన్: బెంగుళూరుకు చెందిన గ్లోబల్ క్వెస్ట్ టెక్నాలజీస్ సంస్థ శుక్రవారం కేసానుపల్లిలోని ఎంఏఎం గ్రూప్ విద్యాసంస్థలలో ప్లేస్మెంట్ డ్రైవ్ నిర్వహించింది. మొత్తం 8 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపిక అయ్యారని కళాశాల డైరెక్టర్ దరువూరి శ్రావ్య, చైర్మన్ ఎంఆర్ శేషగిరిరావు తెలిపారు.

● నరసరావుపేట టౌన్: స్థానిక ఈశ్వర్ ఇంజనీరింగ్ కళాశాల ఏఐఎంఎల్ విద్యార్థి జీ త్రిష ఇన్ఫోసిస్‌లో ఉద్యోగానికి ఎంపిక అయిందని ప్రిన్సిపాల్ డాక్టర్ జీ నాగమల్లేశ్వరరావు శుక్రవారం తెలిపారు. త్రిషకు వార్షిక వేతనం రూ 3.50 లక్షలు లభిస్తుందన్నారు.

● నరసరావుపేట రూరల్: స్థానిక తిరుమల ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన 46 మంది విద్యార్థులు ఇన్ఫోసిస్ కంపెనీకి ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వైవీ నారాయణ తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు రూ.3.60లక్షల వార్షిక వేతనం లభిస్తుందని తెలిపారు.

● నరసరావుపేట రూరల్: మండలంలోని గోనెపూడిలోని ప్రభుత్వ పాఠశాలలో కిశోర బాలికలు, బాల్య వివాహాలపై తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు ఐసీడీఎస్ సీడీపీవో శాంతకుమారి తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

● రొంపిచర్ల: మండలంలోని విప్పర్ల సొసైటీలో సహకార వారోత్సవాల్లో భాగంగా జెండా ఆవిష్కరణ కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు. చైర్మన్ జెల్లిపల్లి శేషమ్మ, సంఘ పర్సన్ యామర్తి అంజలి వెంకట రామారావు, గంగారపు శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా యేగిరెడ్డిపాలెం - లింగముక్కపల్లి రహదారి



లింగముక్కపల్లి సమీపంలో కోతకు గురై ప్రమాదకరంగా ఉన్న రోడ్డు

నూజెండ్ల, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలో మొంథా తుఫాన్ ప్రభావంతో కోతకు గురైన రోడ్డులు ప్రమాదకరంగా మారాయి. యేగిరెడ్డిపాలెం - లింగముక్కపల్లి మార్గంలో జడ్పీ పాఠశాల సమీపంలో రోడ్డు కోతకు గురవ్వటంతో రాత్రి సమయాల్లో వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి. అదే విధంగా గుర్రపునాయుడుపాలెం ఎస్సీ కాలనీలో రోడ్డు కోతకు గురవ్వటంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సంబంధిత శాఖల అధికారులు స్పందించి తుఫాన్ ప్రభావంతో పాడైపోయిన రోడ్లకు త్వరిత గతిన మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.



గుర్రపునాయుడుపాలెంలో కోతకు గురైన రోడ్డు

బాలలతోనే దేశ భవిష్యత్తు, సమాజాభివృద్ధి

● బాలల దినోత్సవంలో చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు



నెహ్రూ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న చీఫ్‌విప్ జీవీ, తదితరులు

వినుకొండ, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): దేశ భవిష్యత్తు, సమాజాభివృద్ధి బాలల విద్య, ఆరోగ్యం, నైతిక విలువలపై ఆధారపడి ఉంటుందని చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు అన్నారు. భారత తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకుని చేసే బాలల దినోత్సవం సందర్భంగా చీఫ్ విప్ కార్యాలయంలో శుక్రవారం జీవీ ఆంజనేయులు పాల్గొన్నారు. నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జీవీ మాట్లాడుతూ బాలల దినోత్సవం ఒక వేడుక మాత్రమే కాదు, బాధ్యతను గుర్తుచేసే రోజు అన్నారు. ప్రతి పిల్లవాడిలో ఉన్న ప్రతిభను వెలికి తీయాలన్నారు. చదువులో, క్రీడల్లో, సృజనాత్మకతలో చిన్నారులకు అందరం తోడ్పాటు అందించాలన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, పార్టీ కార్యకర్తలు, మహిళా సంఘాలు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కృషి: ఎమ్మెల్యే అరవిందబాబు

నరసరావుపేట రూరల్, నవంబర్ 14 (ఆంధ్రజ్యోతి): విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు తెలిపారు. బాలల దినోత్సవం సందర్భంగా నరసరావుపేట మండలం జొన్నలగడ్డ, రంగారెడ్డిపాలెం గ్రామంలోని అంగన్వాడీ స్కూల్, ఎలిమెంటరీ స్కూళ్లను నరసరావుపేట శాసనసభ్యుడు డాక్టర్ చదలవాడ అరవింద బాబు, టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి నల్లపాటి రామచంద్రప్రసాద్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన చిన్నారులతో కలిసి ఆటలు ఆడారు. అనంతరం గ్రామంలోని ఎలిమెంటరీ స్కూల్‌ను సందర్శించి విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు.

● నరసరావుపేట రూరల్: స్థానిక ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో చిల్డ్రన్స్‌డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో చైర్మన్ డా.నాగోతు ప్రకాషరావు మాట్లాడుతూ నెహ్రూ జయంతి సందర్భంగా విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. పోటీల్లో విజయం సాధించిన విద్యార్థులకు ప్రకాష్‌రావు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో డైరెక్టర్ నాగోతు సబిత, ప్రిన్సిపాల్ రేఖా పులేకర్ పాల్గొని విజేతలకు సర్టిఫికెట్లు అందజేశారు.

● వినుకొండ: పట్టణంలోని గీతాంజలి విద్యాసంస్థల ఆధ్వర్యంలో బాలల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గీతాంజలి విద్యాసంస్థల డైరెక్టర్ ఎండ్లూరి శేషగిరిరావు ముఖ్యఅతిథిగా పాల్గొని చిన్నారులకు బాలల దినోత్సవ శుభాకాంక్షలు అందించారు. అనంతరం చిన్నారులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు విద్యార్థులను, పిల్లల తల్లిదండ్రులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కరెస్పాండెంట్ వైఎల్ కిషోర్, ప్రిన్సిపాల్ కృష్ణవేణి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● వినుకొండ టౌన్: పట్టణంలోని గీతమ్స్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో బాలల దినోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా గీతమ్స్ విద్యాసంస్థల కరస్పాండెంట్ మాలపాటి కోటిరెడ్డి, ప్రిన్సిపాల్స్ ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు విద్యార్థినీ, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

● శావల్యాపురం: బాలల దినోత్సవాన్ని శావల్యాపురంలోని భవితా పాఠశాలలో, శ్రీరామ పబ్లిక్ స్కూల్‌లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. భవితా పాఠశాలలో ఎంఈవో మద్దిగుంట్ల సాంబశివరావు పాల్గొని నెహ్రూ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పద్మజ, రిసోర్స్‌పర్సన్‌లు జగన్మోహన్ రెడ్డి, పార్వతి, శ్రీరామ పబ్లిక్‌స్కూల్లో కరస్పాండెంట్ కేవీఆర్ మోహన్‌చంద్, ప్రిన్సిపాల్ రత్నకుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● ఈపూరు: బాలల దినోత్సవాన్ని ఈపూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో సీడీపీవో ఈ పూరివాణి అధ్యక్షతన జరిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ కే.రాజ్యలక్ష్మి, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు

● నరసరావుపేట రూరల్: మండలంలోని ఉప్పలపాడులోని గవర్నమెంట్ హైస్కూల్‌లో న్యూ ఎడ్యుకేషనల్ అండ్ ఎకనామిక్ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో బాలల దినోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో నీడ్స్ సంస్థ డైరెక్టర్ కె. ప్రేమానదం, ఉప్పలపాడు హైస్కూల్ హెడ్మాస్టర్ ఎం.సుందర్‌రావు, హైస్కూల్ ఉపాధ్యాయులు ఏప మధుకుమార్, ఎస్.నాగప్రసాద్, ఎన్.నాగేశ్వరరావు, కేవీ సుబ్బారెడ్డి, బి.జనార్ధన్, జి.సుధాకర్‌రెడ్డి, సీహెచ్. కోటేశ్వరరావు, రాజ్యలక్ష్మి, కృష్ణ, రామకృష్ణాచార్యులు, సచివాలయం ఎంఎస్‌కే లలిత, నీడ్స్ కో ఆర్డినేటర్ రవికుమార్, కమ్యూనిటీ సోషల్ వర్కర్ ప్రేమ్‌కుమార్,శంకర్ రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు

● నరసరావుపేట రూరల్: మండలంలోని లింగంగుంట్ల శంకర భారతిపురం ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) సీఎస్‌ఆర్ ఫండ్స్ ద్వారా ప్రతిభ కనబరచిన 15మంది విద్యార్థులకు కొత్త సైకిల్స్‌ను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజనల్ మేనేజర్, సిబ్బంది పాల్గొన్నారు.

● నరసరావుపేట టౌన్: స్థానిక కే-రిడ్జి ఇంటర్‌నేషనల్ స్కూల్‌లో బాలల దినోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్కూల్ చైర్మన్ నాతాని వెంకటేశ్వర్లు, డైరెక్టర్ కోమటినేని నాసరయ్య, వెంకట్ పూలబాల, ప్రిన్సిపాల్ జీ బర్నబాస్, క్యాంపస్ ఇన్‌చార్జి కోట బాపూజీలు నెహ్రూ చిత్రపటానికి నివాళులర్పించారు. స్కూల్‌లో శిక్షణ పొందుతున్న చిన్నారులు జూడో, స్కేటింగ్, సంగీతం, నృత్య ప్రదర్శనలతో అలరించారు. బాలల దినోత్సవంలో నిర్వహించిన పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు.

● రొంపిచర్ల: మండలంలోని మోడల్ పాఠశాల, కేజీబీవీ పాఠశాలల్లో జరిగిన బాలల దినోత్సవ కార్యక్రమంలో ఎంఈవో బ్రహ్మేశ్వరరావు, ప్రత్యేక అధికారిణి బాలశౌరిలు పాల్గొన్నారు.

● చిలకలూరిపేట: పట్టణంలోని శారదా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన బాలల దినోత్సవ వేడుకలలో ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు పాల్గొని క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. హెచ్‌ఎం కె.రత్నజ్యోతి పాల్గొన్నారు. గార్డ్స్ సంస్థ ఆధ్వర్యంలో శాఖా గ్రంథాలయంలో ఫ్యాన్సీ డ్రెస్, పుస్తక సమీక్ష రాయడం అంశాలపై పోటీలు నిర్వహించారు. పసుమర్రు జెడ్పీ హైస్కూలులో హెచ్‌ఎం వై హనుమంతరావు ఆధ్వర్యంలో చెకుముకి టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ చూపిన వారికి బహుమతులు ఇచ్చారు. పోలిరెడ్డి పాలెం మున్సిపల్ స్కూలులో హెచ్‌ఎం జె హైమావతి ఆధ్వర్యంలో బాలల దినోత్సవం నిర్వహించారు. ఆక్స్‌ఫర్డ్ స్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో సీఐ రమేష్ పాల్గొన్నారు. భాష్యం స్కూల్‌లో సీఈవో ప్రమీల రాణి ఆధ్వర్యంలో బాలల దినోత్సవం జరిగింది.

● నూజెండ్ల: మండలంలోని కంభంపాడు జడ్పీ పాఠశాలలో జరిగిన బాలల దినోత్సవంలో పాఠశాల హెచ్‌ఎం ఎంవీ నాగపద్మజ, ఉపాధ్యాయులు ఎల్.అంజిరెడ్డి, రామాంజిరెడ్డి, ఏ సురేష్, కేబీఎస్ శేఖర్, బీ చినగోవిందు పాల్గొన్నారు.

● నాదెండ్ల: మండలంలోని గణపవరం, సాతులూరు జడ్పీ ఉన్నత పాఠశాలల్లో బాలల దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు కబడ్డీ, ఖోఖోల, తాడు లాగటం పోటీలు నిర్వహించారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న చైర్మన్ నాతాని వెంకటేశ్వర్లు, కోమటినేని నాసరయ్య, తదితరులు

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి

● ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు



శాఖ గ్రంథాలయంలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు తదితరులు

నరసరావుపేట టౌన్. నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు పిలుపునిచ్చారు. శుక్రవారం నరసరావుపేట పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు, బాలల దినోత్సవం నిర్వహించారు. జవహర్ లాల్ నెహ్రూ, అయ్యంకి వెంకటరమణయ్యల చిత్రపటానికి ఎమ్మెల్యే పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు, శనివారం పుస్తక ప్రదర్శన, వ్యాసరచన పోటీలు నిర్వహిస్తామని గ్రంథాయల అధికారి యడ్లపాటి రాధ తెలియజేశారు. కార్యక్రమంలో సహాయక కార్మిక కమిషనర్ మహబూబ్ సుభాని, యూనియన్ బ్యాంక్ మేనేజర్ కేఎస్ రామ్‌ప్రసాద్, దుగ్గింపూడి వీరయ్యచౌదరి, అభ్యుదయ భారతి అధ్యక్షుడు రత్నాకరం రాము, విద్యార్థులు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

● శావల్యాపురం: శావల్యాపురం సెంటర్‌లోని శాఖాగ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాలను గ్రంథాలయాధికారి రావూరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సీతారామయ్య, ఎంఈవో సాంబశివరావులు పాల్గొని నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయులు బీవీ నాగేశ్వరరావు, కేవీఆర్ మోహన్‌చంద్, శ్రీనివాస్‌సింగ్, గ్రామపెద్దలు సనిశెట్టి వీరాంజనేయులు, చెవల శ్రీరాములు, దూదేకుల సైదావలి తదితరులు పాల్గొన్నారు.

● ఈపూరు: జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను శుక్రవారం ఈపూరు, ముప్పాళ్ళ శాఖ గ్రంథాలయంలో ఎంపీడీవో ఉమాదేవి ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రంథాలయాల అభివృద్ధి కమిటీ చైర్మన్ మీసాల చిన్న ప్రసాదు, గ్రంథాలయ అధికారి నాగలక్ష్మి, శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● నరసరావుపేట రూరల్: మండలంలోని ఉప్పలపాడు శాఖా గ్రంథాలయంలో జరిగిన గ్రంథాలయ వారోత్సవాల్లో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ యన్నం వెంకటనర్సిరెడ్డి, మాజీ చైర్మన్ నర్సిరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, జిల్లా పరిషత్ హైస్కూల్ ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ కోటేశ్వరరావు, గ్రంథాలయ నిర్వాహకులు కె.వెంకట్రావు విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.


● రొంపిచర్ల: మండలంలోని రొంపిచర్ల శాఖా గ్రంథాలయంలో జరిగిన కార్యక్రమంలో అధికారి కేసరి రమణారెడ్డి, ఎంఈవో బ్రహ్మేశ్వరరావు, జడ్పీ పాఠశాల హెచ్‌ఎం సుభానీ పాల్గొన్నారు.

● చిలకలూరిపేట: పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో శుక్రవారం జరిగిన జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో మున్సిపల్ కమిషనర్ పి.శ్రీహరిబాబు, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ తేళ్ల సుబ్బారావులు పాల్గొన్నారు. చిలకలూరిపేట మండలం మురికిపూడి శాఖా గ్రంథాలయంలో చెన్నుపాటి నాగరాజు, జెడ్పీ హైస్కూలు హెచ్ ఎం ధనలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి కొచ్చర్ల ప్రభుదాస్, గ్రంథాలయాధికారి శ్రీస్వర్ణ ఏసుబాబు పాల్గొన్నారు.

● యడ్లపాడు: శాఖా గ్రంథాలయంలో జరిగిన జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు ఆంజనేయులు ప్రారంభించారు. గ్రంథాలయ అధికారి చేవూరి అంజమ్మ పాల్గొన్నారు.

● నాదెండ్ల: మండల కేంద్రమైన నాదెండ్లలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో ఎంపీడీవో స్వరూపరాణి, ఎంఈవో కృష్ణారెడ్డి, గ్రంథాలయ అధికారి జీ సుబ్బారావు ఉపాధ్యాయుడు కాంట్రు శ్రీనివాసరావులు నెహ్రూ చిత్ర పటానికి నివాళులర్పించారు.

సీనియర్ వైద్యుడు కంచర్ల సాంబశివరావు మృతి



సాంబశివరావు

చిలకలూరిపేట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యుడు కంచర్ల సాంబశివరావు (87) స్థానిక పండరీపురంలోని ఆయన స్వగృహంలో శుక్రవారం కన్నుమూశారు. ఆయన గత మూడున్నర దశాబ్దాలుగా పట్టణంలో నాగభూషణం మెమోరియల్ నర్సింగ్ హోమ్ పేరుతో ఆసుపత్రి నిర్వహించి పేదల వైద్యుడిగా పేరుపొందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. సాయంత్రం ఇక్కడ అంత్యక్రియలు జరిగాయి. స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు సాంబశివరావు భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ కందిమళ్ళ జయమ్మ, టీడీపీ రాష్ట్ర వైద్యుల విభాగం ప్రధాన కార్యదర్శి డాక్టర్ ముప్పాళ్ళ హనుమంతరావు, పురుషోత్తమపట్నం సాయిబాబా గుడి నిర్వాహకులు బత్తినేని శ్రీనివాసరావు, ఐఎంఏ స్థానిక శాఖ డాక్టర్లు సంతాపం ప్రకటించారు.

స్కిల్ పోటీల్లో ప్రతిభచూపిన విద్యార్థులకు అభినందన

శావల్యాపురం, నవంబరు14 (ఆంధ్రజ్యోతి): జిల్లా సర్వశిక్ష అభియాన్ ఆధ్వర్యంలో సత్తెనపల్లి లయోలా పాఠశాల్లో జరిగిన స్కిల్ కాంపిటేషన్‌లో ప్రతిభ కనబరచి జిల్లాలో తృతీయస్థానంలో నిలిచిన శావల్యాపురం జడ్పీపాఠశాల విద్యార్థులకు శుక్రవారం పాఠశాలలో అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. హెచ్‌ఎం బొడ్డపాటి విజయలక్ష్మి మాట్లాడుతూ స్కిల్ కాంపిటేషన్‌లో 9వతరగతి విద్యార్థులు గాయత్రి, వైష్ణవి, శ్రావణసంధ్య, స్వాతి రిటైల్ వ్యాపారానికి సంబంధించిన ఇన్నోవేషన్ ప్రాజెక్టు తయారుచేసి తృతీయస్థానంలో నిలిచారన్నారు. నలుగురు విద్యార్థులను, వారికి ప్రేరణ ఇచ్చిన ఒకేషనల్ టీచర్ దాసరి ధనరాజ్‌ను డీఈవో చంద్రకళ అభినందించి ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారని తెలిపారు.విద్యార్థులను ఎస్‌ఎంసీ చైర్మన్ పాటిబండ్ల శ్రావణ్‌కుమమార్, ఉపాధ్యాయులు అభినందించారు.

ప్రతి ఫిర్యాదును పరిష్కరిస్తా: చీఫ్ విప్ జీవీ



ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరిస్తున్న జీవీ ఆంజనేయులు

వినుకొండ టౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రజాదర్బార్‌లో తనకు అందిన ప్రతి సమస్యను పరిష్కరిస్తానని ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ చీఫ్ విప్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ప్రజా దర్బార్‌లో జీవీ ఆంజనేయులు పాల్గొని నియోజకవర్గ ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా స్వీకరించారు. ఫిర్యాదులను పరిష్కరించేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, టీడీపీ నాయకులు, యువత, మండల స్థాయి బాధ్యులు పాల్గొన్నారు.

పలు సమస్యలపై ప్రత్తిపాటికి అర్జీలు



అర్జీలు స్వీకరిస్తున్న ప్రత్తిపాటి

చిలకలూరిపేట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): పలు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావుకు ఇనాం భూముల సమస్య, 167ఏ బైపాస్‌కు భూములిచ్చిన వారికి పరిహారం ఇప్పించాలని బొప్పూడి, పసుమర్రు తదితర గ్రామాల రైతులు విన్నవించారు. పట్టణంలోని సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్ పక్కన ఉన్న గ్రామ కంఠంలో ఉన్న పాత ప్రభుత్వ ఆసుపత్రి స్థలంలో ప్రభుత్వ తల్లీ, పిల్లల హాస్పిటల్, ట్రామా కేర్ సెంటర్, బ్లడ్ బ్యాంక్ నిర్మించాలని మాజీ కౌన్సిలర్ జమాల్ బాషా, చేవూరి కృష్ణమూర్తి, నాయుడు శివకుమార్, పేలూరి రామారావు వినతి పత్రం అందచేశారు. మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, యార్డు చైర్మన్ షేక్ కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ, కమిషనర్ జస్వంత్‌రావు తదితరులు

170 మందికి ప్రధానమంత్రి ఆవాస్ యోజన

● ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు

నరసరావుపేట టౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట మున్సిపాలిటీ పరిధిలో 170 మంది లబ్ధిదారులకు ప్రధానమంత్రి ఆవాస్ యోజన గృహ నిర్మాణ మంజూరు పత్రాలను శుక్రవారం ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అందజేశారు. పట్టణంలోని చిలకలూరిపేట రోడ్డు బైపాస్ వద్ద కేసానుపల్లి లేఅవుట్ గృహనిర్మాణ సముదాయం వద్ద ఈ పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ గృహ సముదాయాల సమీపంలో టిడ్కో గృహాలు ఉండటం వల్ల మౌలిక సదుపాయాలు ఏర్పాటుచేశామన్నారు. తాగునీటి సౌకర్యం కోసం చర్యలు తీసుకున్నామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావు, హౌసింగ్ అధికారులు, ఉమ్మడి కూటమి నాయకులు పాల్గొన్నారు.

అర్హులందరికీ నివేశన స్థలాలిస్తాం

నరసరావుపేట రూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అర్హులైన పేదలందరికీ నివేశన స్థలాలు పంపిణీ చేసి పేదవారి సొంతింటి కల నెరవేర్చడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు తెలిపారు. నరసరావుపేట మండలం రంగారెడ్డిపాలెంలో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వడానికి కేటాయించిన 6ఎకరాల ప్రభుత్వ భూమిని పంచకుండా వైసీపీ నాయకులు కబ్జా చేయాలని ప్రయత్నించారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఈ సమస్యపై ఎమ్మెల్యే అరవిందబాబు శుక్రవారం రంగారెడ్డిపాలెంలో పర్యటించారు. ఎమ్మార్వోతో కలిసి భూమిని పరిశీలించి, తక్షణమే ఈ భూమిలో పేదలకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని ఎమ్మార్వోను ఆదేశించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి నల్లపాటి రాము, వీరవల్లి వంశి, గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నాయీ బ్రాహ్మణులకు ప్రత్యేక షాపులు

● కార్పొరేషన్ డైరెక్టర్ మద్దిరాల గంగాధర్

నరసరావుపేట టౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్‌ల పరిధిలోని కాంప్లెక్స్‌లలో నాయీ బ్రాహ్మణులకు ప్రత్యేక షాపులు కేటాయింపు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నామని డైరెక్టర్ మద్దిరాల గంగాధర్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జీవో13 ప్రకారం కలెక్టర్లు, మున్సిపల్ అధికారులు,కార్పొరేషన్ కమీషనర్లు ఈ నిబంధలను పాటించి నాయిబ్రాహ్మణులకు షాపులు కేటాయించాలని ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చిందన్నారు. నాయీ బ్రాహ్మణుల సెలూన్ షాపులు ఉన్న ప్రతి ఒక్క నాయీ బ్రాహ్మణులకు 200 యూనిట్లు ఉచిత విద్యుత్‌కు రూ.150కోట్లు నిధులు కేటాయించారన్నారు.

మోటారు సైకిళ్లను ఢీకొన్న ఆర్టీసీ బస్సు... మహిళకు తీవ్ర గాయాలు

నరసరావుపేట రూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట - నరసరావుపేట ప్రధాన రహదారిపై రెండు మోటారు సైకిళ్లను చిలకలూరిపేటకు చెందిన ఆర్టీసీ బస్సు వెనుక నుంచి ఢీకొన్న సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. నరసరావుపేట మండలం జొన్నలగడ్డ గ్రామానికి చెందిన కొరిటాల గోవిందమ్మ, మరి కొందరు కేశానుపల్లి వద్ద గల తమ పొలం కొలతలు సర్వే చేయించుకుని ఇంటికి తిరిగి వస్తుండగా కేశానుపల్లి వద్ద చిలకలూరిపేట వైపు నుంచి ప్రయాణికులతో వస్తున్న ఆర్టీసీ హైర్ బస్సు రెండు మోటారు సైకిళ్లను వెనుక నుంచి ఢీకొట్టి ఆగకుండా వెళ్ళిపోయాడు. ఈ ప్రమాదంలో నరసరావుపేట మండలం జొన్నలగడ్డ గ్రామానికి చెందిన కొరిటాల గోవిందమ్మకు తలకు తీవ్రంగా గాయాలై అపస్మారక స్థితిలోకి వెళ్ళింది. ఆమెను నరసరావుపేటలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. గోవిందమ్మ అల్లుడు శంకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ప్రమాదానికి కారణమైన బస్సు డ్రైవరును అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు రూరల్ ఎస్ఐ కిషోర్ తెలిపారు.

550 మంది స్వాములకు తేళ్ల బ్రదర్స్ సద్ది వితరణ

చిలకలూరిపేట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన తేళ్ల శ్రీధర్, తేళ్ళ సుధీర్‌ల ఆధ్వర్యంలో వారి తండ్రి తేళ్ళ హరిప్రసాద్ జ్ఞాపకార్థం సద్ది వితరణ చేశారు. నరసరావుపేట రోడ్డులో పోలిరెడ్డిపాలెంలోని అభయాంజనేయ స్వామి వారి గుడి వద్ద మాల ధరించిన 550మంది స్వాములకు కార్తీకమాసం ప్రారంభం నుంచి నిత్యం సద్ది వితరణ చేస్తున్నారు. ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు శుక్రవారం ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.